Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 254 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 22 - 5 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# చకచకా 22ఎ నిషేధిత జాబితా భూములకు విముక్తి

**- ఇప్పటికే 1.6 లక్షల ఎకరాలపై రైతులకు శాశ్వత హక్కులు - మరో 1.9 లక్షల ఎకరాల చుక్కల భూములకు త్వరలో మోక్షం - లక్షల ఇంటి స్థలాలు, ఇళ్ల పట్టాలపై నిషేధం ఎత్తివేత - పట్టణ ప్రాంతాల్లో 10 వేల పేదల గృహా నిర్మాణాల క్రమబద్ధీకరణ - త్వరలో మరో 25 వేల గృహాలకు మోక్షం - పేదలకు అనుకూలంగా ఫ్రీ హోల్డ్ భూములపై నిర్ణయం - భూ హక్కుల రక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం - రెండేళ్లలో రైతులకు భరోసా...పేదలకు ప్రాధాన్యం**

**అమరావతి, (రాజధాని వార్తలు):** గత ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పాలనలో భూ బకాసురులు.. రైతులు, భూ యజమానులు, పేదల భూములను అడ్డగోలుగా దోచుకున్నారు. ఇందుకోసం రెవెన్యూ వ్యవస్థను పూర్తి స్థాయిలో భ్రష్టు పట్టించారు. రీ సర్వే పేరుతో రైతులకు లేనిపోని సమస్యలు సృష్టించడంతో పాటు ఉన్న పొలం కంటే తక్కువ విస్తీర్ణం పట్టాదారుపుస్తకాల్లో చూపించింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. లెక్కలేనన్ని సమస్యలు రెవెన్యూ శాఖలో సృష్టించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెట్టడానికి చాలా శ్రమించాల్సి వస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా భూములకు సంబంధించిన ఫిర్యాదులే 90 శాతం వస్తున్నాయంటే గత ప్రభుత్వం ఏ స్థాయిలో సమస్యలు సృష్టించిందో అవగాహన చేసుకోవచ్చు. రెవెన్యూ సమస్యల్లేని రాష్ట్రంగా ఏపీ ఉండాలన్న ముఖ్యమంత్రి ఆదేశాలతో రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ మార్గదర్శకంలో ఈ రెండేళ్లలో ఎన్నో సంస్కరణలను రెవెన్యూ శాఖలో తీసుకొచ్చారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌లాంటి నల్ల చట్టాన్ని, ఇబ్బందికరంగా ఉన్న నాలా చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసి కీలక నిర్ణయం తీసుకుంది. అంతే కాదు భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిటేడ్ యాక్ట్‌ను తీసుకొచ్చారు. రైతులకు ఊరట కలిగించేందుకు ఆర్ఓఆర్ యాక్ట్‌ను సవరించారు. రీ సర్వేపై గ్రామసభలు, అన్ని రకాల భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులు నిర్వహించి అక్కడిక్కడే రైతుల సమస్యలను పరిష్కరించారు. రీ సర్వే 2.0లో రైతలను భాగాస్వాములను చేసి సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో వివాదాలకు తావులేని భూ రికార్డులను రూపొందిస్తున్నారు. రెవెన్యూ వ్యవస్థలో బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగిస్తూ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్ శాఖలను అనుసంధిస్తూ భూములకు డిజిటల్ భద్రతను ప్రభుత్వం కల్పిస్తోంది. రైతులే నేరుగా ఆన్లైన్లో తమ భూములకు సంబంధించి 1బి, అడంగల్‌కు సొంతంగా డిజిటల్ లాక్ చేసుకునే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. దీంతో రైతుల అనుమతి లేకుండా ఏ అధికారి కూడా ఆ భూమిని మ్యుటేషన్ గానీ, రిజిస్ట్రేషన్ గానీ చేయడానికి





వీల్లేదు. అలాగే 15 రకాల భద్రతా అంశాలతో రాజముద్రతో పకడ్బందీగా రూపొందించిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను కూడా రైతులకు ప్రభుత్వం అందిస్తోంది.

**22ఎ నిషేధిత భూములకు విముక్తి**

రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటూ, భూ యజమాన్య హక్కులు కలిగి ఉండి కూడా గత ప్రభుత్వ నిర్వాకంతో భూములు 22ఎ నిషేధిత జాబితాలో ఉండడంతో ఇబ్బందులకు గురౌతున్నారు. వైసీపీ ప్రభుత్వం రీ సర్వే పేరుతో భూములు కొట్టేయాలనే దుర్బుద్ధితో అనేక వందల ఎకరాలను 22ఎ జాబితాలో చేర్చింది. రైతుల ఇబ్బందులను గమనించిన కూటమి ప్రభుత్వం ఐదు రకాల భూములైనటువంటి... నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూములు, మాజీ సైనికాధికారులు భూములు, స్వాతంత్ర్య సమర యోధుల భూములు, రాజకీయ బాధితుల భూములు, 1954కు అసైన్ చేసిన భూములు, ఒకే సర్వే నెంబర్ కారణంగా 22ఎ జాబితాలోకి వెళ్లిన భూములకు విముక్తి కలిగించింది. అంతేకాదు 22ఏ జాబితా నుంచి తొలగింపు ప్రక్రియను కూడా చాలా సులభతరం చేసింది. 9 రకాల పత్రాల్లో ఏ ఒక్క పత్రం ఉన్నా ఈ భూములకు 22ఎ నుండి విముక్తి లభిస్తుంది. దీంతోపాటు ఏళ్ల పాటు నుండి సమస్యాత్మకంగా ఉన్న గ్రామ సర్వీసు ఈనామ్ భూములకు కూడా మోక్షం కల్పించారు. 1.3 లక్షల గ్రామ సర్వీసు ఇనామ్ భూములకు పూర్తి హక్కులు కల్పించారు. ఆ తర్వాత కొద్ది రోజులకే 33 వేల ఎకరాల షరతులగల పట్టా భూములను కూడా 22ఎ జాబితా నుండి తొలగించారు. ఈ భూములను రైతులు నిరంభ్యతరంగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చు. అవసరాలకు విక్రయించుకోవచ్చు. అదేవిధంగా చుక్కల భూముల జాబితాలో ఉండి 22ఎలో ఉన్న మరో లక్షా 90 వేల ఎకరాల భూములకు మరికొన్ని రోజుల్లో విముక్తి కలిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వబోతోంది. ఇప్పటికే ఈ భూములపై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. రైతులు, భూ యజమానుల హక్కుల పరిరక్షణ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రానున్న కాలంలో ఈ అడుగులు మరింత వేగంగా పడబోతున్నాయి.

**పేదలకు పెద్ద ఊరట... లక్షల ఇళ్ల స్థలాలపై పూర్తి హక్కులు**

ఎన్టీఆర్ ప్రభుత్వ కాలం నుంచి పేద ప్రజలకు అసైన్డ్ చేసిన ఇళ్ల స్థలాలను నిషేధిత జాబితా నుండి తొలగించి వారికి పూర్తి హక్కులు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 10 ఏళ్ల కాలం ముగిసిన అసైన్డ్ ఇళ్ల స్థలాలన్నింటికీ రిజిస్ట్రేషన్ చేసి పూర్తి హక్కులు కల్పించాలని, అసైన్డ్ పట్టా, ఇంటి పన్ను రసీదు తప్ప మరేమీ కోరకుండా రిజిస్ట్రేషన్ చేయాలని రిజిస్ట్రార్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ స్థలాలు 22ఎలో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములకు సంబంధించి ఇళ్ల పట్టాలు, ఇళ్లు రెగ్యులరైజేషన్ చేసుకున్న వారికి రెండేళ్లలోనే పూర్తి హక్కులు కల్పించింది. దీంతో పట్టణ పేదలకు పెద్ద ఎత్తున ఉపశమనం లభించింది. అలాగే పేదలకు ఇళ్ల పథకం కింద అసైన్డ్ స్థలాలు పొందిన పేదలందరికీ కూడా పట్టా పొందిన రెండేళ్లకే పూర్తి హక్కులు కల్పించాలని ఆలోచిస్తోంది. దీనిపై త్వరలోనే ప్రభుత్వ నిర్ణయం వెలువడనుంది. ఇక పట్టణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న 10 వేల కుటుంబాల గృహాలను రెగ్యులరైజ్ చేసింది. మరో 25 వేల గృహాలను త్వరలో క్రమబద్ధీకరించనున్నారు. గ్రామకంఠాల్లో తరతరాలు ఇంటి స్థలాలు కలిగి ఉన్న, ఇళ్లు నిర్మించుకున్న వారికి లింక్ డాక్యుమెంట్లు లేనప్పటికీ...వారికీ పూర్తి హక్కులను ప్రభుత్వం కల్పించింది. ఈ నిర్ణయాల ద్వారా లక్షల సంఖ్యలో లబ్దిదారులకు ఇళ్ల స్థలాలపై పూర్తి హక్కులు లభించనున్నాయి. ఈ రెండేళ్లో కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వంగా వ్యవహరించింది.

**ఏళ్ల తరబడి పెండింగ్ సమస్యలకు పరిష్కారం**

ఒకవైపు రెవెన్యూ వ్యవస్థలో పెద్ద ఎత్తున సంస్కరణలు తీసుకొస్తూనే మరోవైపు ఒక గ్రామానికో, కొందరి రైతులకో పరిమితమై ఏళ్లగా పరిష్కారం కాని భూ సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక్ చొరవతో పరిష్కరించబడ్డాయి.

తిరుపతి జిల్లాలోని శెట్టిపల్లి గ్రామంలో రెండు వేల కోట్ల రూపాయల విలువ చేసే 380 ఎకరాల భూమిని 2,111 మంది లబ్దిదారులకు అన్ని అడ్డంకులను తొలగించి అప్పగించారు. శ్రీసత్య సాయి జిల్లా నల్లమడ మండలం గోపెపల్లి గ్రామంలో 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 305 ఎకరాలకు పరిష్కారం చూపి రైతుల కళ్లల్లో ప్రభుత్వం ఆనందం నింపింది. ఏలూరు జిల్లాల్లో ఒక్క రోజులోనే 142 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి భూ యాజమానులకు ఊరటనిచ్చారు. సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం గుంజేపల్లి గ్రామంలో 13.59 ఎకరాల్లో ఉన్న ఇళ్ల పట్టాల భూములు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండగా నిషేధిత జాబితా నుండి తొలగించి 226 కుటుంబాలకు ప్రభుత్వం పెద్ద ఉపశమనం కల్పించింది.

# ఈ ఏడాది సెప్టెంబర్‌కల్లా ప్రాజెక్టుల గ్రౌండింగ్

**- 2028 చివరినాటికి ప్రాజెక్టులు ప్రారంభించేలా కార్యాచరణ - మంత్రుల కమిటీ, అధికారులకు లక్ష్యం నిర్దేశించిన సీఎం - పెట్టుబడిదారులకు సింగిల్ పోర్టల్ ద్వారా సేవలు - భూ కేటాయింపుల్లో పర్యాటక ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యం - గోవా ప్లస్‌గా సూర్యలంక బీచ్ - త్వరలో బాపట్ల మాస్టర్ ప్లాన్ - 23 నెలల్లో ఏపీకి 756 ప్రాజెక్టులు, రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు - రాష్ట్ర యువతకు 21.20 లక్షలకు పైగా ఉద్యోగావకాశాలు - ఎంఓయూలు, ఎస్ఐపీబీ ఆమోదం పొందిన ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష**



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల గ్రౌండింగ్ ఈ ఏడాది సెప్టెంబర్‌కల్లా జరగాలని, డిసెంబర్ 2028 కల్లా ప్రారంభమయ్యేలా చూడాలని మంత్రుల కమిటీ, అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్రం అనుసరిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని ఆచరణలో చూపాలన్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంఓయూల స్థితిగతులు, ప్రాజెక్టుల పురోగతిపై ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. మంత్రుల కమిటీ తీసుకున్న చర్యలు, ప్రస్తుత కార్యాచరణ, భవిష్యత్ ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈ 23 నెలల్లో రూ.21,64,258 కోట్ల విలువైన మొత్తం 756 ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చాయని, వీటితో 21,20,567 ఉద్యోగాలు వస్తున్నట్టు తెలిపారు. ప్రైవేటు రంగంలో ఏవియేషన్ ప్రాజెక్టులను ఆకర్షించేలా చర్యలు చేపడతామని లోకేష్ చెప్పారు. పెట్టుబడుల సాధనలో దేశంలోనూ, ప్రైవేటు రంగంలోనూ ఏపీ పేరు మార్మోగుతోందని, ఎంఎస్ఎంఈల అనుమతులు, ఇతర వివరాలను త్వరలోనే వెబ్ సైట్ ద్వారా అందిస్తామని లోకేష్ తెలిపారు.

**21 ప్రధాన ఆలయాలతో టెంపుల్ టూరిజం సర్క్యూట్**

ప్రాజెక్టుల గ్రౌండింగ్, అనుమతుల వివరాలు, ఉద్యోగాల కల్పనపై సింగిల్ పోర్టల్‌లో డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భూ కేటాయింపుల్లో మొదటగా పర్యాటక ప్రాజెక్టులకు, తర్వాత ఐటీ కంపెనీలకు ప్రాధాన్యత కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. టూరిజం, ఐటీ లాంటి ప్రాజెక్టులకు వినూత్నంగా మల్టీ పర్పస్ భవనాల నిర్మాణం చేపట్టే ఆలోచన చేయాలని సూచించారు. సూర్యలంక బీచ్ ఫ్రంట్ ను గోవా ప్లస్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేయాలని బాపట్ల బీచ్‌కు త్వరలో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏపీలోని 21 ప్రధాన ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం ప్రాజెక్టు వేగంగా చేపట్టాలన్నారు. ఐటీ ప్రాజెక్టులు తమ కార్యకలాపాలు 18 నెలల్లో ప్రారంభించేలా చూడాలని స్పష్టం చేశారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ తయారీ ప్రాజెక్టులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి సూచించారు.

**అంశాల పరిష్కారానికి మంత్రుల కమిటీ కృషి**

పరిశ్రమల గ్రౌండింగ్ వేగవంతం కోసం మంత్రుల కమిటీ కృషి చేస్తుండగా, విదేశాల నుంచి రాష్ట్రంలో ఏర్పాటు చేసే పెట్టుబడుల వివరాలను ఈడీబీ సేకరిస్తోంది. అన్ని శాఖల పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు ఐటీ పోర్టల్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల కమిటీ ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహిస్తోంది. ప్రాజెక్టుల వేగవంతమైన గ్రౌండింగ్ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు నిర్దేశిత గడువులోగా కార్యకలాపాలు చేపట్టేలా చూడాలని మంత్రుల కమిటీకి సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



# ఏపి ఎఫ్‌డిసి ఛైర్మన్‌గా భరత్ భూషణ్, వైస్ ఛైర్మన్‌గా మెహర్ రమేష్

## - మరో 14 మందిని డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిల్మ్ టివి థియేటర్ అభివృద్ధి సంస్థ ఛైర్మన్, డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఛైర్మన్‌గా నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ పి.భరత్ భూషణ్ పేరుకే మొగ్గు చూపించింది. వైస్ ఛైర్మన్‌గా దర్శకుడు మెహర్ రమేష్‌ను ఎంపిక చేసింది. 14 మంది డైరెక్టర్లను నియమించింది. సినీ రచయిత, తెనాలి కళల కాణాచి పరిషత్ నిర్వాహకులు బుర్రా సాయి మాధవ్, చిలకలూరిపేటకు చెందిన రిటైర్డ్ అధ్యాపకులు, రచయిత డా.కందిమళ్ల సాంబశివరావులను డైరెక్టర్లుగా నియమించారు. అలాగే హీరో సుమన్ తల్వార్, హీరో శివాజీ, నిర్మాతలు చదలవాడ శ్రీనివాసరావు, కూచిభోట్ల వివేకానంద, నటి ఝాన్సీ, సీనియర్ జర్నలిస్ట్ కె.ఉమా మహేశ్వరరావు, దర్శకుడు వి.సముద్ర, మీర్ ఎస్., ఎ.సత్యనారాయణ, ఎస్.వెంకట కృష్ణారెడ్డి, జి.రాజ్ వెంకటేశ్వర యాదవ్, డి.సత్యనారాయణ లను డైరెక్టర్లుగా నియమించారు. ఇక టివి, సినిమా నంది అవార్డులు, నంది నాటకోత్సవాలు ఈ కమిటీ ఆధ్వర్యంలో జరగనున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ లో సినిమా, టివి షూటింగులు జరిగేందుకు, సినీ, టివి, రంగస్థల కళాకారుల అభివృద్ధికి ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చిత్తశుద్ధితో కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# బీసీ గురుకుల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్లు

## - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**తాడేపల్లి/అమరావతి, (రాజధాని వార్తలు) :** విద్యతో పాటు క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమని, దీన్ని దృష్టిలో పెట్టుకునే బీసీ గురుకులాలు విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్, షూస్ అందజేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసం కలిగించడంతో పాటు వాటిలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ముగ్గురు క్రీడాకారులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి సవిత అభినందించారు. గత నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లో ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గుంటూరుకు చెందిన టి.నాగజ్యోతి 76 కేజీల విభాగంగా జూనియర్ స్థాయిలో పోటీ పడింది. బాలిక 355 కేజీలు ఎత్తి, జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం గెలిచుకుంది. అదే జూనియర్ స్థాయి విభాగంలో పోటీపడిన కె.సత్యరామ్ రాజ్ 53 కేజీల విభాగంలో 110 కేజీలు ఎత్తి జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం గెలుచుకున్నాడు. సబ్ జూనియర్ స్థాయి విభాగంగా పోటీపడిన వినోద్ కుమార్ 110 కేజీలు ఎత్తి, జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం సాధించాడు. ఈ ముగ్గురు క్రీడాకారులతో పాటు వారికి కోచింగ్ అందజేసిన ఎండీ కమ్రుద్దీన్ ను మంత్రి సవిత అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులతో విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ గురుకులాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్ లతో పాటు షూస్ కూడా అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. అంతకుముందు మంత్రి సవిత బంగారు పతకాలు సాధించిన ముగ్గురు క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

# బాలమేధావి మౌర్యకు సత్కారం!




**నల్లజర్ల (తూర్పుగోదావరి), (రాజధాని వార్తలు):** రెండున్నర ఏళ్ల చిరు ప్రాయంలోనే ప్రపంచ రికార్డులు సాధిస్తున్న మౌర్యకు గురువారం చిరుసత్కారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జీ.వీ.వీ.ప్రసాద్, సమాజ సేవకులు మల్లిపూడి రాజారావు ఆధ్వర్యంలో ఈ సత్కారం జరిగింది. అసాధారణ జ్ఞాపకశక్తిని ప్రదర్శించిన చిన్నోడు మౌర్యకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థానం సాధించిన విషయం తెలిసిందే. ఇటువంటి ప్రతిభావంతుల్ని ప్రోత్సహించడం కనీస బాధ్యతగా భావించి మౌర్య ఇంటికి ఆవపాడు గ్రామం వెళ్లి తామీ కార్యక్రమం చేసినట్టు ప్రసాద్, రాజారావు వెల్లడించారు. మౌర్యలాంటి పిల్లలు మన సమాజానికి స్ఫూర్తినిచ్చేలా తీర్చిదిద్దిన మౌర్య తల్లి రాణీని అభినందిస్తూ, నేటి తరం తల్లితండ్రులకు ఆదర్శంగా రాణీ నిలుస్తారని సత్కరిస్తూ కొనియాడారు.

# నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిమాండ్




**వాకాడు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర కమిటీ పిలుపుతో మొదటి రోజు నిరసనలు ఉధృతం రాష్ట్ర సెంట్రల్ కమిటీ పిలుపులో భాగంగా తిరుపతి జిల్లా వాకాడు మండలం వాకాడు డిపో పరిధిలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటి రోజు ధర్నా కార్యక్రమం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. తిరు పతి జిల్లా ఉపాధ్యక్షులు చంద్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమానికి రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎం.చెంచలయ్య ముఖ్య అతిథిగా హాజరై ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై గళమెత్తారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రవేశపెడుతున్న విద్యుత్తు బస్సులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించకుండా ఆర్టీసీ లేదా ప్రభుత్వం ద్వారానే నేరుగా కొనుగోలు చేయాలని, అలాగే వాటిని సంస్థ సిబ్బందితోనే నిర్వహించేలా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తున్న 'స్త్రీ శక్తి' బస్సులలో ప్రస్తుతం అమలు చేస్తున్న "జీరో" టికెట్టు విధానాన్ని పూర్తిగా నిలుపుదల చేయాలని కోరారు. దానికి బదులుగా మిగతా ప్రయాణీకులకు ఇచ్చే విధంగానే సాధారణ టిక్కెట్టు ఇచ్చే పద్ధతిని తీసుకు వచ్చి, సిబ్బందిపై అనవసరంగా పెరుగుతున్న తీవ్రమైన పనిభారాన్ని తగ్గించాలని స్పష్టం చేశారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలపై స్పందిస్తూ, వెంటనే పిఆర్‌సి కమిటీని నియమించి ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలన్నారు. వీటితో పాటు దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న 4 డీఏలు, అరియర్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని పట్టుబట్టారు. ఈ నెల 13వ తేదీన ప్రభుత్వానికి, గౌరవ మేనేజింగ్ డైరెక్టర్‌కి సమర్పించిన మెమొరాండంలోని దీర్ఘకాలిక సమస్యలన్నింటినీ కాలయాపన చేయకుండా పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ప్రయాణీకుల సౌకర్యార్థం రూట్లలో సరిపడా కొత్త బస్సులను వెంటనే కొనుగోలు చేయాలని, సంస్థలో అన్ని కేటగిరీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వారు కోరారు. రిటైర్ అయిన మరియు దురదృష్టవశాత్తూ చనిపోయిన సిబ్బంది కుటుంబాలకు అందవలసిన సెటిల్మెంట్లను ఆలస్యం చేయకుండా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఏపీపీటీడీ ఉద్యోగులను ప్రస్తుతం ఉన్న ఈహెచ్ఎస్ పరిధి నుండి మినహాయించి, గతంలో ఆర్టీసీలో ఉన్న మెరుగైన ఉచిత వైద్య సదుపాయాన్ని తిరిగి యథాతథంగా అమలు చేయాలని నేతలు ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో డిపో అధ్యక్షులు ప్రశాంత్, కార్యదర్శి సంపత్, ఛైర్మన్ శ్రీనివాసులు, గ్యారేజ్ అధ్యక్షులు సుధీర్, గ్యారేజ్ కార్యదర్శి శ్రీనివాసులుతో పాటు భారీ సంఖ్యలో యూనియన్ నాయకులు, కార్మికులు మరియు సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని ఘన విజయం చేశారు.

# మల్లెతీగ పురస్కారం-2026 కోసం కవితలకు ఆహ్వానం




**విజయవాడ, (రాజధాని వార్తలు):** మంచి సాహిత్యాన్ని 'రికార్డు' చేయాలన్న సత్సంకల్పంతో 2013లో మల్లెతీగ పురస్కారాన్ని ప్రారంభించాం. అప్పటినుండి కరోనా వరకు నిరాటంకంగా ఏడేళ్ళపాటు కొనసాగించాం. ఆ తర్వాత కొన్ని కారణాల చేత ఈ పురస్కారాన్ని కొనసాగించలేకపోయాం. మళ్లీ ఈ సంవత్సరం నుండి మల్లెతీగ పురస్కారాన్ని కొనసాగించబోతున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. 'మల్లెతీగ పురస్కారం-2026'కు తెలుగు కవులందర్నీ ఆహ్వానిస్తున్నాం. కవితలు సామాజికాంశాల్ని స్పృశించేవిగా వుండాలి. ఈ పోటీ కోసం ప్రత్యేకంగా రాసిన కవితల్ని మాత్రమే పంపాలి. సమాజంలో వున్న ఏ సమస్యనైనా కవితగా మలచవచ్చు. కవిత నిడివి విషయంలో క్లుప్తత పాటించాలి. పెద్ద కవితలు పోటీకి స్వీకరించడం కుదరదు. కవిత కాగితానికి ఒక వైపే రాయాలి. కవిత రాసిన కాగితంపై పేరూ, చిరునామాలు రాయకూడదు. విడిగా హామీపత్రం రాస్తూ అందులో మీ పేరు, చిరునామా రాయాలి. కవితతోపాటు మీ ఫోటో కూడా పంపాలి. కవిత ఒక కాపీని మీ దగ్గర వుంచుకోవాలి. మాకు పంపిన కవితల్ని తిప్పి పంపడం కుదరదు.కీ.శే. వజ్జల విజయలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు జవాన్ల గేయ రచయిత (ప్రస్తుతం నవమల్లెతీగలో 'వృద్ధోపనిషత్' గేయాలు రాస్తున్నారు) వజఝల కృష్ణమూర్తి శర్మ- యుఎస్ఏ సహృదయ సౌజన్యంతో ఈ పురస్కారాన్ని మల్లెతీగ సాహిత్యం సేవాసంస్థ కొనసాగిస్తుంది. ప్రధాన పురస్కారం పొందిన కవికి రూ. 8,000/-ల నగదుతో సత్కారం వుంటుంది. ఆత్మీయ పురస్కారం పొందిన ఐదుగురి కవులకు రూ. 1,000/-ల చొప్పున నగదుతో సత్కారం వుంటుంది. పురస్కార గ్రహీతలు విజయవాడలో జరిగే పురస్కార ప్రదానోత్సవ సభకు తప్పక హాజరై పురస్కారాన్ని స్వయంగా తీసుకోవాలి. పురస్కార గ్రహీతలకు నగదుతోపాటు శాలువా, జ్ఞాపిక, సర్టిఫికెట్టు వుంటాయి. ప్రధాన పురస్కారం పొందిన కవి/కవయిత్రి ఫోటో నవమల్లెతీగ మాసపత్రిక ముఖచిత్రంపై రంగుల్లో వస్తుంది. కవితల్ని కొరియర్ లేదా రిజిస్టర్ పోస్టులో పంపాలి. ఎడిటర్, నవమల్లెతీగ మాసపత్రిక, 26-16-4, టి.ఎఫ్ - 1, శుభశ్రీ టవర్స్, ఉయ్యూరు జమీందారు స్ట్రీట్, గాంధీనగర్, విజయవాడ - 520 003 చిరునామాకు జూన్ 30వ తేదీలోగా పంపాలి. ఈ మెయిల్ ద్వారా కవితల్ని పంపేవారు malleteega.sss@gmail.com కు పంపవచ్చు. పూర్తి వివరాలకు 92464 15150 నెంబరులో సంప్రదించవచ్చు.

# మా లక్ష్యం ఒక్కటే నెల్లూరు రూరల్ అభివృద్దే : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## - ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్ ఆశీస్సులతో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్‌లో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఆమంచర్ల, దొంతాలి గ్రామాలలో 70 లక్షల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించిన మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు బూడిద విజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ మండలంలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 19 కోట్ల 70 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టాము. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆమంచర్ల గ్రామ అభివృద్ధికి 5 కోట్ల 35 లక్షల నిధులు కేటాయించాము. నెల్లూరు రూరల్ మండలంలో ఇంకా ఏమైనా అభివృద్ధి పనులు ఉంటే రాబోయే రోజుల్లో చేస్తాం. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. ఇంత మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి మీ అందరి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలి. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యులు అల్లాభక్షు, ఎంపీటీసీ చండి అరుణమ్మ, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ పమజుల ప్రదీప్,తెలుగుదేశం పార్టీ నాయకులు మలినేని వెంకయ్య నాయుడు, చండి శంకరయ్య, మలినేని వేణు గోపాల్ నాయుడు, గేనేడి వెంకటేశ్వర్లు నాయుడు, కందుకూరు రమణమ్మ, అశోక్, రత్నమ్మ, వెంకటేశ్వర్లు నాయుడు, సాధినేని వెంకటేశ్వర్లు నాయుడు, చిరంజీవి నాయుడు, మురళి, గంగయ్య, శ్రీహరి, చండి మురళి, బాలు వెంకట రమణయ్య, మలినేని వెంకటేశ్వర్లు, మలినేని శ్రీహరి, రమణయ్య, చరమల దయాకర్, శేషయ్య, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు పట్టణ సమగ్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ : మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆత్మకూరు మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌పై నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులతో రాష్ట్ర దేవా దాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమీక్ష నిర్వహించి అభివృద్ధి ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. ఆత్మకూరు పట్టణాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సరికొత్త మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. పట్టణంలో రహదారుల విస్తరణ, అంతర్గత రోడ్ల కనెక్టివిటీ మెరుగుదల, సీసీ రోడ్ల నిర్మాణం, ఆధునిక డ్రెయినేజ్ వ్యవస్థ, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు సూచించారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డు సమానంగా అభివృద్ధి చెందేలా అవసరాల ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేసి ప్రజలకు మెరుగైన పౌరసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పట్టణ విస్తరణ, పెరుగుతున్న జనాభా అవసరాలు, భవిష్యత్ ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని దీర్ఘకాలిక ప్రణాళికతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

# రైల్వే ప్రాజెక్టులు జాతీయ రహదారుల పనులను పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి, (రాజధాని వార్తలు):** జిల్లాలో రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణ పనులు, భూసేకరణ, ఏపీఐఐసీ పరిశ్రమల ప్రాజెక్టులు, పట్టాదారు పాసు బుక్ పంపిణి, మ్యుటేషన్, రీ-సర్వే, పిజిఆర్ఎస్, సెన్సెస్ తదితర అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను ప్రణాళికాబద్ధంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులుతో కలిసి జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల పనులు, వైజాగ్-చెన్నై కారిడార్ పైప్‌లైన్ పనులు, ఏపీఐఐసీ పరిశ్రమల అభివృద్ధి, దుగ్గరాజపట్నం ప్రాజెక్టు, ఏడీబీ రోడ్లు, శ్రీ సిటీ, ఎల్‌జీ ఫేజ్-1,2, స్పేస్ సిటీ ఫేజ్-1,2,3,4, నాయుడుపేట ఫేజ్-2, వానెల్లూరు, పాగలి తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పెండింగ్ భూ సమస్యలు మరియు పట్టాదారు పాసు బుక్ పంపిణి, మ్యుటేషన్, రీ-సర్వే, పి జి ఆర్ ఎస్ సెన్సెస్ తదితర అంశాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సిటీ, ఏపీఐఐసీ పరిధిలోని ఎల్‌జీ ఫేజ్-1,2,3, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, నాయుడుపేట ఫేజ్-2, వానెల్లూరు, పాగలి తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెబ్‌ల్యాండ్‌కు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణ మరియు అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. వైజాగ్-చెన్నై కారిడార్ పైప్‌లైన్ పనులు, నడికుడి-శ్రీకాళహస్తి, ఏర్పేడు-పూడి, గుమ్మడి పూండి-గూడూరు, గూడూరు-రేణిగుంట, తిరుపతి-కాట్పాడి, అర్కోణం-రేణిగుంట రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నాయుడుపేట-రేణిగుంట, రేణిగుంట-కడప, రేణిగుంట-చెన్నై రహదారి విస్తరణ పనులు, ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పేర్కొన్నారు. సాగరమాల పథకం కింద చేపడుతున్న ప్యాకేజీ-2,3,4 జాతీయ రహదారి పనులు నాణ్యతతో పూర్తి కావాలని, రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఫారెస్ట్, జలవనరుల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ-5, ఏడీబీ రోడ్ల పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసు బుక్ పంపిణి కార్యక్రమాన్ని వేగవంతం చేసి అర్హులైన రైతులకు త్వరితగతిన అందజేయాలని సూచించారు. మ్యుటేషన్ దరఖాస్తులను నిర్దేశిత గడువులోపు పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలని తెలిపారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమయానికి సేవలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రీ-సర్వే కార్యక్రమంలో గ్రామ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. భూసరిహద్దుల నిర్ధారణ, రికార్డుల సవరణ, సాంకేతిక అంశాలపై క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అయిన పీజిఆర్ఎస్ ద్వారా వచ్చిన వినతులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన కేసుల్లో రైతులు, భూయజమానులతో సమన్వయం పాటిస్తూ చట్టపరమైన ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. పరిహారం చెల్లింపులు, అవార్డు ప్రక్రియలు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణను పారదర్శకంగా పూర్తి చేయాలని తెలిపారు. సెన్సెస్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో డేటా సేకరణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సంబంధిత సిబ్బందికి తగిన మార్గదర్శకాలు అందించాలని సూచించారు. స్వీయ గణన, గృహ గణన కార్యక్రమాలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రతి అంశంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పనుల్లో జాప్యం లేకుండా ప్రతిరోజూ పురోగతిని సమీక్షిస్తూ లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్‌మాండ్, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్, శ్రీ సిటీ లీగల్ అడ్వైజర్ భాను, సంబంధిత తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సెక్షన్ అధికారులు భాస్కర్, శివప్రసాద్, భూసేకరణ విభాగ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎకరాకు రూ.28 లక్షల నష్టపరిహారం అందిస్తాం

## - రైతులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుంది - విద్యార్హత కలిగిన వారికి ఉద్యోగాలు కల్పిస్తాం : జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్



**సత్యవేడు, (రాజధాని వార్తలు):** సత్యవేడు మండలంలోని ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటీపాకం గ్రామాలలో ఏపీఐఐసీ పరిశ్రమల అభివృద్ధి కోసం జరుగుతున్న భూసేకరణలో భాగంగా పలు గ్రామాల రైతులతో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేంద్రరెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్. ఎస్.వెంకటేశ్వర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రైతులతో భూసేకరణ, నష్టపరిహారం, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సత్యవేడు మండలంలోని ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటీపాకం గ్రామాలలో ఏపీఐఐసీ పరిశ్రమల అభివృద్ధి కోసం జరుగుతున్న భూసేకరణలో భాగంగా రైతులకు ఎకరాకు రూ.28 లక్షల నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు. రైతులు ప్రభుత్వానికి సహకరించి పారిశ్రామిక అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందించేలా నిర్ణయం తీసుకుందని కలెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా భూముల్లో ఉన్న మామిడి చెట్లు, ఇతర వృక్షాలు, బోర్‌వెల్లు, షెడ్లు, గోడలు, కట్టడాలు మరియు ఇతర స్థిరాస్తులకు ప్రత్యేక అంచనాల ప్రకారం అదనపు పరిహారం కూడా చెల్లిస్తామని తెలిపారు. భూ పరిహారం, అదనపు పరిహారంతో జత చేస్తే పెద్ద మొత్తంలో రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఇవేకాకుండా భూములు ఇచ్చిన రైతుల పిల్లల్లో ఉన్నత విద్యను అభ్యసించిన వారికి శ్రీ సిటీ పరిధిలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ చెప్పారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలా వారికి అండగా ఉంటుందన్నారు. భూసేకరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామని, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏపీఐఐసీ ద్వారా చేపడుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులు జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరగడానికి, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి మరియు ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. అభివృద్ధి మరియు రైతుల సంక్షేమం రెండింటినీ రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. శ్రీసిటీ ఏర్పాటుతో ఆ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. తడ, సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు ప్రాంతాలు గతంతో పోలిస్తే వేగంగా అభివృద్ధి చెందాయని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని పరిశ్రమలు, మౌలిక వసతులు ఏర్పాటు అయ్యి ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడతాయని వివరించారు. గతంలో కూడా రైతులు సహకరించి శ్రీసిటీ అభివృద్ధికి భూములు ఇచ్చారని, ఆ సహకారంతోనే ఈరోజు రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా శ్రీసిటీ ఎదిగిందని గుర్తుచేశారు. ప్రస్తుతం పారిశ్రామిక అభివృద్ధికి రైతులు సహకరిస్తే భవిష్యత్తులో వారి పిల్లలకు, యువతకు మరింత మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రైతులు తమ వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ పత్రాలు, వెబ్ ల్యాండ్ రికార్డులు మరియు ఇతర ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. నష్టపరిహారం విషయంలో అభ్యంతరాలు ఉన్న రైతులు చట్టబద్ధంగా ఆర్బిట్రేషన్‌కు వెళ్లే అవకాశం ఉందని వివరించారు. ముందుగా పరిహారం స్వీకరించి తరువాత ఆర్బిట్రేషన్ దాఖలు చేసుకోవచ్చని కలెక్టర్ వివరించారు. కోర్టు కేసులు, చట్టపరమైన ప్రక్రియలు ఉన్నప్పటికీ ప్రాజెక్టు పనులు ముందుకు సాగుతున్నాయని, రాళ్లకుప్పం ప్రాంతానికి సంబంధించిన న్యాయపరమైన అంశాలు పరిష్కారమైన ఆ ప్రాంతంలో కూడా భూ సేకరణ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేస్తూ, రైతుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి స్పందించిన జిల్లా కలెక్టర్‌కి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో సత్యవేడు తహసీల్దార్ శివ ప్రసాద్, ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటీపాకం గ్రామాల వీఆర్వోలు, భూసేకరణ విభాగ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆకస్మిక తనిఖీ





**రేణిగుంట, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్., రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

అలాగే స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేసి పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, నేరాలను అరికట్టేం దుకు ప్రత్యేక దృష్టి సారించాలని, నేర నియంత్రణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా గట్టి చర్యలు చేపట్టాలని అధికారు లను ఆదేశించారు. ప్రజలకు భద్రతాభావం కలిగేలా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యల విషయంలో అలసత్వం ప్రదర్శించకుండా తక్షణ స్పందనతో బాధితులకు అవసరమైన సహాయం అందించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి చట్టపరమైన చర్యలు వేగవంతంగా చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ జయచంద్ర, ఎస్ఐ ధర్మారెడ్డిలు చలపతి, ఏఎస్ఐ పార్వతి, కోర్ట్ కానిస్టేబుల్స్ హేమంత్ కుమార్, ఐడి పార్టీ రాజశేఖర్, బారుష, గౌరీ నాయుడు, శీను, త్రినాధరావు, పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కార్యకర్తల పక్షపాతి : డాక్టర్ జి.దశరథాచారి



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** కార్యకర్తే అధినేత అని తెలుగు దేశం పార్టీ అధినేత, సియం చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు వేదంలా భావించి, ఆచరణలో చేసి చూపుతున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కార్యకర్తల పక్షపాతి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ జి.దశర థాచారి కొనియాడారు. తెలుగుదేశం పార్టీ వీరాభిమాని, శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రతీ ఒక్కరి నోట్లో నాలుకలా ఉంటూ, అటు తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, ఇటు శ్రీకాళహస్తి నియోజక వర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నాయకత్వ పటిష్ఠత కొరకు నిత్యం శ్రమించే పసుపు దళ సైనికుడు, అకుంఠిత దీక్షాపరుడు, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్ జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో కిషోర్ చేత కేక్ కట్ చేయించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మరో రెండు రోజుల్లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వారికి కూడా ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేసి, వారికి శుభాభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22న తన పుట్టినరోజు సందర్భంగా ప్రజలందరి ప్రేమ, ఆశీస్సులు నాకు ఎల్లప్పుడూ ఉండాలని, అయితే ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని అనవసరపు ఖర్చులతో ఫ్లెక్సీ హోర్డింగ్స్, టపాసులు వంటి కార్యక్రమాలకు దూరంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరారు. ఒక ప్రజాప్రతినిధిగా ప్రజల అభిమానం తనకు ఎంతో విలువైనదని, ఆ అభిమానాన్ని కేక్ కటింగ్ లేదా భారీ వేడుకల రూపంలో కాకుండా, రక్తదాన శిబిరాలు లేదా పేదలకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాల ద్వారా చూపిస్తే అది నాకు ఎంతో సంతృప్తినిస్తుందని, కాబట్టి మీ అందరి సహకారం, ఆశీస్సులు నాపై ఎల్లవేళలా ఉండాలని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డా.జి.దశరథాచారి, మిన్నల్ రవి, కామేష్ యాదవ్, డా.యం.ఉమేష్ రావు, యం. సుబ్బయ్య, వజ్రం కిషోర్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** జూనియర్ ఎన్టీఆర్ 43వ జన్మదిన వేడుకలను శ్రీకాళహస్తి ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 43 కేజీల భారీ కేక్‌ను శ్రీకాళహస్తి జూనియర్ ఎన్టీఆర్ అభిమాని ఊరందూరు బాలాజీ చేసి అభిమానులకు పంచి పెట్టారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్‌పై వున్న అభిమానంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని శ్రీకాళహస్తి దేవస్థానంకి వచ్చే భక్తులకు 1000 మజ్జిగ ప్యాకెట్లు పంచి పెట్టారు. అదేవిధంగా జూనియర్ ఎన్టీఆర్ పేరున శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు అమర్నాథ్ రెడ్డి, గోపి, తొండు ప్రవీణ్, మురారి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ బస్సులకు ఆర్టీసీ సిబ్బందిని వినియోగించాలి

## - నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ డిమాండ్



**గూడూరు, (రాజధాని వార్తలు):** విద్యుత్ బస్సులను ప్రభుత్వము ఆర్టీసీ ద్వారానే కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందిని వినియోగించుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ డిమాండ్ చేసింది బుధవారం నేషనల్ మజ్దూర్ యూనిట్ ఆధ్వర్యంలో గూడూరులోనే ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ సమస్యలపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ...ప్రభుత్వం విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారా కొనుగోలు చేయాలని, వాటిని ఆర్టీసి సిబ్బందితోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, స్త్రీ శక్తి బస్సులో జీరో టికెట్టు ఇచ్చే విధానాన్ని నిలుపుదల చేసి మిగతా ప్రయాణికులకు టికెట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకొని సిబ్బందిపై పనిభారం తగ్గించాలని, ప్రయాణికులకు సరిపడా కొత్త బస్సులు వెంటనే కొనుగోలు చేయాలని, ఏపీపీ టీడీ ఉద్యోగులను ఈ హెచ్ ఎస్ నుండి మినహాయించి గతంలో ఆర్టీసీ నందు ఉన్న వైద్య సదుపాయం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ వైస్ ప్రెసిడెంట్ జె రత్నాకర్, రీజినల్ వైస్ ప్రెసిడెంట్ వెంకయ్య, డిపో చైర్మన్ భాష, సెక్రటరీ ప్రవీణ్, పోలిరెడ్డి, రవి, గాంధీ, గురవయ్య, దిలీప్, పార్వతి మంజుల తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఆ జ్ఞాననిధులను విస్మరిస్తే వినాశనమే!

'ఉత్తమ భావాలు అన్ని వైపుల నుంచి రావాలి' అని విశ్వసించిన మన పూర్వీకులు అభివృద్ధి పరిచిన జ్ఞాన వ్యవస్థలను గుడ్డిగా ఆరాధించడమో లేదా పూర్తిగా తిరస్కరించడమో జరుగుతోంది. ఇవి ఆలోచనారహిత వైఖరులు. భారతీయ జ్ఞాన వ్యవస్థల పట్ల అటువంటి ప్రతిస్పందనలు వివేకవంతమైనవి కావని ఇటీవలి రెండు నూతన పుస్తకాలు సూచించాయి. పురాతన భారతీయుల శాస్త్రీయ విజ్ఞానాన్ని, తాత్విక భావస్రవంతిని అల్లా టప్పా గా భావించకుండా గంభీరమైన మేధో నిబద్ధతతో మనం వాటిని శోధించి తీరాలని కూడా ఆ పుస్తకాలు నొక్కి చెప్పాయి. ఈ మేధా కర్తవ్యాన్ని ఎలా చేయాలో, ఎలా చేయకూడదో కూడా అవి నిర్దేశించాయి. భారతీయ ఉన్నత విద్యా జగత్తులో ఇప్పుడు విస్తృతంగా చర్చిస్తున్న విషయం భారతీయ జ్ఞాన వ్యవస్థలు (ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్- ఐకేఎస్). ప్రతి విశ్వవిద్యాలయమూ ఐకేఎస్ సంబంధిత సదస్సును నిర్వహించి దాని వివరాలను సచిత్రంగా, సవివరంగా తమ వెబ్‌సైట్‌పై ఉంచుతున్నది. విద్యావేత్తలూ పురాతన భారతీయ జ్ఞాన సంచయంలో ఒక వినూత్న సత్యాన్ని ఆవిష్కరించేందుకు ఆరాటపడుతున్నారు. తమ పరిశోధనా కృషి, ఐకేఎస్ మధ్య ఉన్న సంబంధాన్ని సగర్వంగా చెప్పుకుంటున్నారు. భారతీయ జ్ఞాన వ్యవస్థలపై ఉన్నత విద్యా ప్రపంచంలో వెల్లివిరుస్తున్న ఈ అభిమానం సహజమైనదేనా? మేధో అంతః ప్రేరణల జనితమేనా? కాదు, కానే కాదు. ప్రభుత్వం పురికొల్పిన విద్యాసక్తి అది. పురాతన భారతీయుల జ్ఞానాన్ని ఆధునిక పాఠ్యాంశాలలో భాగంగా చేసేందుకై భారతీయ జ్ఞాన వ్యవస్థల పరిశోధన, బోధనను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వం పనిగట్టుకుని ప్రోత్సహిస్తున్న భారతీయ జ్ఞాన వ్యవస్థల పరిశోధనా కార్యకలాపాల ప్రహసనంపై తీవ్ర విమర్శనాత్మక ప్రతిస్పందనలు అనివార్యంగా వ్యక్తమవుతున్నాయి. దేశ ప్రజల్లో 'వైజ్ఞానిక దృక్పథం'ను పెంపొందించాలని అభిలషిస్తున్నవారు పురాతన భారతీయ జ్ఞానం అశాస్త్రీయమైనదని, అర్థరహితమైనదని కొట్టివేస్తున్నారు. జ్ఞాన సంప్రదాయాలకు ప్రభుత్వం అంత ప్రాధాన్యమివ్వడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. కుల వ్యవస్థను వ్యతిరేకించేవారు బ్రాహ్మణీయ ప్రపంచ దృక్పథాన్ని సమస్త భారతీయులపై రుద్దే ప్రయత్నమే ఐకేఎస్‌ను ప్రోత్సహించడమని నిరసిస్తున్నారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నవారు నిరంకుశ పాలనా ధోరణులపై నిరసన ప్రబలకుండా అదుపు చేసేందుకే ఐకేఎస్ పేరిట మిథ్యా జాతీయ స్వాభిమానాన్ని పెంపొందిస్తున్నారని దుయ్యబడుతున్నారు. ఐకేఎస్‌కు అనుకూలంగా ప్రభుత్వం ఎంత ఎక్కువగా వాదిస్తే ప్రగతిశీల, ఉదారవాద విద్యావంతులు అంత ఎక్కువగా భారతీయ జ్ఞాన వ్యవస్థ అనే భావనను పరిహసిస్తున్నారు. ప్రభుత్వ వాదన ఎలా ఉన్నప్పటికీ ఐకేఎస్‌ను ఈ విధంగా అపహసించడం, తిరస్కరించడం తీవ్ర మేధాపరమైన, రాజకీయ తప్పిదమే అవుతుంది, సందేహం లేదు. సరే, ఆధునిక మానవ జ్ఞానచరిత్ర తన స్వీయ చరిత్రే అని పాశ్చాత్య ప్రపంచం భావిస్తోంది. మానజ్ఞానానికి ఏకైక భండారం తమ మేధ అని పాశ్చాత్య దేశాలు మిడిసిపడుతున్నాయి. అహంకరిస్తున్నాయి. ఇది పూర్తిగా చారిత్రక అసంబద్ధం. ప్రాచ్య ప్రపంచం ముఖ్యంగా భారతదేశం ఆ అసంగతాన్ని ఎలా విశ్వసిస్తుంది? సహిస్తుంది? తాము పుట్టి పెరిగిన మాతృభూమి జ్ఞాన వనరులు, మేధో సంప్రదాయాలపై రేపటి తరాలకు అవగాహన లేకుండా చేయడం సాంస్కృతిక వినాశనానికి దారి తీస్తుంది. వేల సంవత్సరాల భారతీయ సాంస్కృతిక, నాగరికతా వారసత్వాన్ని మరచిపోవడం లేదా వాటికి దూరమవడం నిస్సందేహంగా రాజకీయ తప్పిదం అవుతుంది. వలసపాలన నుంచి స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న నాటి నుంచి మన మేధా సంప్రదాయాలను ఉపేక్షించామన్న గర్హనీయ వాస్తవాన్ని అంగీకరించడం ద్వారా భారతీయ జ్ఞాన వ్యవస్థలతో మన బాంధవ్యాన్ని అధునాతనం చేసుకోవడం ప్రారంభమవ్వాలి. భావాలలో స్వరాజ్య సాధనకు సంబంధించిన అజెండాలో భారతీయ జ్ఞానవనరుల పునరుద్ధరణ, పునర్నిర్మాణం అంతర్భాగమవ్వాలి. మేధోపరమైన, సాంస్కృతిక స్వీయ నిర్ణయాధికారమే నిజమైన స్వాతంత్ర్యం అనేది మనం విస్మరించకూడదు. ఐకేఎస్‌తో సమస్య దాని మౌలిక భావన కాదు, దాని రూపకల్పనే అని చెప్పక తప్పదు భారతీయ జ్ఞాన వ్యవస్థల పరిశోధనకు ప్రభుత్వం నిర్దేశించిన విధానం భావనాత్మకంగా లోపభూయిష్టమైనది. దానికి సమగ్ర దృక్పథం కొరవడింది. పైగా పలు కుదింపులతో దాని పరిధి సంకుచితమయింది. భారతీయ జ్ఞాన వ్యవస్థలను ప్రాచీనకాలపు అవశేషాలుగా పరిగణించడం మొట్టమొదటి పెద్ద కుదింపు. సజీవ, చైతన్యశీల భారతీయ జ్ఞాన సంప్రదాయాలు పురాతన యుగాలలో మాత్రమే వర్ధిల్లాయా? సుదూర గతంపైన మాత్రమే దృష్టి సారించడం రెండో కుదింపు. ముస్లిం, బ్రిటిష్ పాలనా యుగాలలో సమున్నతంగా జరిగిన మేధో కృషిని ఐకేఎస్ ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తోంది. జ్ఞాన వ్యవస్థలను కేవలం రాతపూర్వక గ్రంథాలకే పరిమితం చేయడం మూడో కుదింపు. వ్యవసాయం, నేత కార్మికులు, చేతి వృత్తుల వారి దైనందిన కార్యకలాపాలలో నిక్షిప్తమై ఉన్న ఆచరణాత్మక, నిగూఢ జ్ఞానాన్ని విస్మరించడం సమంజసం కాదు. గ్రామీణ సమాజాలలో నేటికీ ఆ జ్ఞాన సంప్రదాయాలు ప్రయోజనకరంగా వర్థిల్లుతూనే ఉన్నాయి. వాటిని ఉపేక్షిస్తే నష్టం వాటిల్లేది ఎవరికి? ఐకేఎస్ పరిగణనలోకి తీసుకుంటున్న పురాతన గ్రంథాలు పూర్తిగా బ్రాహ్మణీయ మేధో సంప్రదాయానికి చెందినవే కావడం నాలుగో కుదింపు. ప్రాంతీయ, దేశీ సంప్రదాయాలను శోధించక పోవడం సరికాదు. భారతీయ జ్ఞాన వ్యవస్థలను ఆధునిక పాశ్చాత్య ప్రమాణాలు, దృక్కోణాల పరంగా మూల్యాంకనం చేయడం ఒక పెద్ద పొరపాటు. ఇది సత్యావిష్కరణకు ఎలా దోహదం చేస్తుంది?

# ఘనంగా ముగిసిన జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలు

## - జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలతో కోనసీమకు దేశ వ్యాప్తంగా గుర్తింపు



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలు ఘనంగా ముగిసాయి. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి వచ్చిన 990 మంది మహిళా, పురుష పవర్ లిఫ్టర్లు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలను అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి ప్రారంభించి ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. కోనసీమలో జాతీయ స్థాయి పోటీలు విజయవంతంగా నిర్వహించి సహకరించిన ఎంపీ హరీష్ బాలయోగికి అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్, ఆసియా ఫెడరేషన్, కామన్‌వెల్త్ ఫెడరేషన్ అనుబంధంతో నిర్వహించిన ఈ పోటీల ద్వారా కోనసీమకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందని నిర్వాహకులు పేర్కొన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులతో అమలాపురం క్రీడా వేదికగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులు కోనసీమ ప్రాంతానికి రైల్వే సౌకర్యం కల్పించాలని ఎంపీ హరీష్ బాలయోగిని కోరారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ కోనసీమలో జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ వేదికగా ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎంపీ హరీష్ బాలయోగి మాట్లాడుతూ క్రీడాకారులకు నేడు జాతీయ స్థాయి గుర్తింపు పొంది రేపు అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందని అన్నారు. గెలుపు మాత్రమే కాకుండా పోటీల్లో పాల్గొనడం ద్వారా అనుభవం పెరిగి భవిష్యత్తులో విజయాలు సాధించవచ్చన్నారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరు రోజుల పాటు పోటీలు విజయవంతంగా నిర్వహించామని పాల్గొన్న క్రీడాకారులకు ఆహారం, నీరు, వసతి వంటి అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. త్వరలో దక్షిణాఫ్రికాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు క్రీడాకారులు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా విశిష్ట అతిథిగా పాల్గొని విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రౌన్ మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో గంధం పల్లంరాజు, ఒంటెద్దు వెంకన్నాయుడు, మున్సిపల్ మాజీ చిక్కాల గణేష్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి నల్ల పవన్, జిల్లా, రాష్ట్ర, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గైర్హాజర్ అయిన అధికారులపై కలెక్టర్‌కు రిపోర్ట్

## - సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో సూర్యనారాయణ





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమా వేశానికి హాజరుకాని పలు శాఖల అధికారులపై జిల్లా కలెక్టర్కు నివేదించనున్నట్టు ఎంపీడీవో కేవీ సూర్యనారాయణ అన్నారు. పెద్దాపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో మే నెలకి సంబంధించి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎం పీపీ పెంకే వెంకటలక్ష్మి అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో కెవి సూర్యనారా యణ శాఖల వారీగా అధికారులను సమీక్షించారు. సభలో మండల విద్యాశాఖధికారి ప్రభాకర శర్మ మాట్లాడుతూ పెద్దాపురం మండలములో 1676 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షకు హాజరైతే వారిలో 1396 మంది ఉత్తీర్ణిత సాధించి 83 శాతం ఉత్తీర్ణత సాధించి నట్టు చెప్పారు. ఏపీఎం వెలుగు సూర్యనారాయణ మాట్లాడుతూ పెద్దాపురం మండలంలో స్వయం సహాయక సంఘాలకు ఋణాల టార్గెట్ 2026-27 సంవత్సరానికి రూ. 75 కోట్లు కాగా ఇప్పటికీ వరకూ రూ. 10 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. ఇంకా స్త్రీ నిధి ద్వారా మండలములో రూ. 36 కోట్లు మహిళల వ్యాపారాలకు టార్గెట్ ఉందని, మహిళలకు వ్యాపారం చేసుకొనుటకు వ్యక్తిగత ఋణములు కూడా సిబిల్ బాగుంటే మంజూరు చేస్తారని తెలిపారు. మండల ఇంజనీరింగ్ అధికారి యువై రత్నం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 64 పనులు మంజూరైతే 61 పనులు పూర్తి చేయుట జరిగినదని, 3 పనులు ప్రగతిలో ఉన్నవని వివరించారు.

ఉపాధి హామీలో తారు లింకు రోడ్డులు 8 పనులు ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ గంగాధరం సభను మాట్లాడుతూ ఎస్బిఎం పథకం క్రింద దేవా లయాలు, పాఠశాలలు దగ్గర మంచినీటి ప్లాంట్లు మంజూరు చేస్తామని, వాటి అంచనా మొత్తం రూ. 3 లక్షల్లో 70 శాతం ఎస్బీఎం నిధులు 30 శాతం పంచాయితీ నిధులతో మంజూరు చేయుట జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఈ సమావేసానికి ఎలక్ట్రికల్, ఫిషరీస్, లేబర్ ఆఫీస్, ఎక్సయిజ్, సోషల్ ఫారెస్ట్ శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై వీరిపై జిల్లా కలక్టరుకు రిపోర్ట్ చెయ్యనున్నట్టు ఎంపీడీవో సూర్యనారాయణ తెలిపారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశానికి సాంకేతికతను పరిచయం చేసిన నేత రాజీవ్ గాంధీ : సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశానికి సాంకేతికతను పరిచయం చేసి ప్రపంచంలో గుర్తింపు తెచ్చిన మహనీయుడు రాజీవ్ అని కొనియాడారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని చెప్పుకొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంటు



సమావేశాలు ఏర్పాటు చేసి లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు... రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

## హెల్మెట్ ప్రయోజనంపై అవగాహన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో, పెద్దాపురం డిఎస్పి ఏబిజీ తిలక్ సూచనల మేరకు సామర్లకోట సిఐ ఎ కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో సామర్లకోట - కాకినాడ ప్రధాన రహదారిలోని ఐదు తూములు సమీపంలో ప్రయాణికులకు హెల్మెట్ ఉపయోగముపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఉపయోగంపై అవగాహన కల్పించి సమీపంలో ఉన్న హెల్మెట్ షాపుల వద్ద నుండి సుమారు 50 హెల్మెట్స్ వరకు కొనిపించి హెల్మెట్ లేనివారికి అందజేసారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోకుండా ప్రయాణం చేయాలని సిఐ కోరారు. ఈ సందర్భంగా కృష్ణ భగవాన్ మీడియోతో మాట్లాడుతూ సామర్లకోట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను కల్పించడం ద్వారా కొంతవరకు అయినా ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందన్నారు. ప్రయాణికులు ప్రతి ఒక్కరు భద్రత నియమాలను పాటించడం వల్ల ప్రమాదాలను అరికట్టటంలో సహకరించాలని కోరారు. అదేవిధంగా ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణించడం, వేగవంతంగా డ్రైవింగ్ చేయడం, చాలా ప్రమాదకరమని ప్రయాణికులకు వివరించారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మూర్తి, రాజా, ట్రాఫిక్ ఎస్ఐ దుర్గారావు, ట్రాఫిక్ సిబ్బంది స్టేషన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మరిడమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం గ్రామ దేవత అయిన శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయంలో హైకోర్ట్ న్యాయమూర్తి వి సుజాత ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ కార్యనిర్వహణ అధికారిణి కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం న్యాయమూర్తికి ఆలయ పండితులు వేద ఆశీర్వాదం అందించారు. అలాగే అమ్మవారి శేష వస్త్రం, అమ్మవారి చిత్రపఠం, ప్రసాదం న్యాయమూర్తి సుజాతకు అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వెంట పెద్దాపురంకు చెందిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఎస్ఐ వి.మౌనిక తదితరులు ఉన్నారు.

## బాలుడు కుటుంబాన్ని పరామర్శించిన ఎస్సీపిసిఆర్ సభ్యురాలు డాక్టర్ నాగ మానస



**అమలాపురం, (రాజధాని వార్తలు):** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 7 ఏళ్ల బాలుడు కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు డాక్టర్ నాగ మానస పరామర్శించారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం పేరాయి చెరువు వద్ద జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఏడేళ్ల బాలుడి అయితాబత్తుల వెంకట్ జస్వంత్ కుటుంబాన్ని డాక్టర్ నాగ మానస పరామర్శించి దురదృష్టకర సంఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసి మృతుని కుటుంబ సభ్యులకు ఆమె ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్ట సమయంలో బాలల హక్కుల కమిషన్ మీ కుటుంబానికి అండగా ఉంటుందని నాగ మానస కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలల భద్రత, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం యొక్క ప్రాముఖ్యతను ఆమె తెలిపారు. స్థానిక నివాసితులతో ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై పిల్లలను తీసుకు వెళ్లేటప్పుడు తల్లిదండ్రులు, వాహనదారులు అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి విషాద సంఘటనలు జరగకుండా రహదారి భద్రతా చర్యలను పటిష్టం చేయాలని సంబంధిత అధికారులకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట ఎంపీడీవో, ఎంఈఓ, అమలాపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వై కే డి రమాదేవి, సూపర్వైజర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది ఎం.మహాలక్ష్మణ్, స్కూల్ హెచ్ఎం, స్కూల్ టీచర్స్, అంగన్వాడీ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మైకేల్ జాక్సన్ కేసు వెనుక అసలు నిజాలు?.. ట్రైలర్‌తో పెరిగిన ఆసక్తి




ప్రపంచాన్ని తన సంగీతంతో ఊపేసిన పాప్ దిగ్గజం మైకేల్ జాక్సన్ గురించి చర్చలు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. ఆయన పాటలు, డ్యాన్స్ స్టెప్పులు, స్టేజ్ ప్రెజెన్స్ ఎంతటి సంచలనం సృష్టించాయో, ఆయన వ్యక్తిగత జీవితం చుట్టూ వచ్చిన వివాదాలు కూడా అంతే పెద్ద చర్చకు దారి తీశాయి. ఇప్పుడు మైకేల్ జాక్సన్: ది వెర్డిక్ట్ పేరుతో రూపొందిన కొత్త డాక్యుసిరీస్ మళ్లీ అదే ప్రశ్నను ప్రపంచం ముందుకు తెస్తోంది. ఇప్పటికే బయోపిక్‌తో మైకేల్ జాక్సన్ పేరు మరోసారి గ్లోబల్ ట్రెండ్‌గా మారిన సమయంలో, ఇప్పుడు ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ ఆయన లైఫ్‌లోని అత్యంత వివాదాస్పద అధ్యాయాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడం ఎంటర్టైన్‌మెంట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. 2003లో బాలల లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న మైకేల్ జాక్సన్ ఆ సమయంలో ప్రపంచవ్యాప్తంగా భారీ మీడియా ట్రయల్‌ను ఎదుర్కొన్నారు. కోర్టు చివరకు ఆయనను నిర్దోషిగా ప్రకటించినప్పటికీ, ప్రజల మదిలో ఆ కేసు మిగిల్చిన ముద్ర మాత్రం పూర్తిగా చెరిగిపోలేదు. ఇప్పుడు రిలీజైన డాక్యుసిరీస్ ట్రైలర్ చూస్తే, కోర్టు విచారణలో పాల్గొన్న జ్యూరీ సభ్యులు, లాయర్లు, జర్నలిస్టులు, ప్రత్యక్ష సాక్షుల వాఖ్యాలతో అప్పటి పరిస్థితులను మళ్లీ తెరపైకి తీసుకు రాబోతున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. కానీ ఈ సిరీస్ కేవలం ఒక కేసు గురించే కాదు, ప్రపంచ వ్యాప్తంగా స్టార్‌డమ్ ఒక వ్యక్తి జీవితాన్ని ఎంతగా మార్చేస్తుందో చూపించే ప్రయత్నంలా కూడా కనిపిస్తోంది. ప్రపంచం మొత్తం అభిమానించే స్థాయికి ఎదిగిన వ్యక్తి ప్రతి కదలిక వార్త అవుతుంది. ప్రతి ఆరోపణ సంచలనం అవుతుంది. ప్రతి వ్యక్తిగత విషయం ప్రజా చర్చగా మారుతుంది.

మైకేల్ జాక్సన్ జీవితం అందుకు పెద్ద ఉదా హరణగా నిలిచింది. ఇప్పుడు ఓటీటీ ప్లాట్‌ఫార్మ్లు కూడా అదే ఆసక్తిని మార్కెట్‌గా మార్చుకుంటున్నాయి. నిజ జీవిత వివా దాలు, సెలబ్రిటీ స్కాండల్స్, కోర్టు కేసులు, మీడియా ట్రయల్స్ ఆధారంగా రూపొందుతున్న డాక్యుసిరీస్‌లకు ప్రపంచ వ్యాప్తంగా భారీ ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా మైకేల్ జాక్సన్ లాంటి గ్లోబల్ ఐకాన్ చుట్టూ ఉన్న మిస్టరీ, అభిమానుల ఎమోషన్, విమర్శలు.. ఇవన్నీ ఉండటంతో ఈ సిరీస్‌పై మరింత ఆసక్తి పెరుగుతోంది. ఒకవైపు అభిమానులు ఆయనపై వచ్చిన ఆరోపణల వెనుక నిజాలు బయటకు రావాలి అంటుంటే, మరోవైపు విమర్శకులు ఒక లెజెండ్ వ్యక్తిగత జీవితాన్ని మరణానంతరం కూడా వదలడం లేదంటూ స్పందిస్తున్నారు.

# నాని 'ప్యారడైజ్'.. ఆ రెండింటినీ కలిపి దాటేస్తుందా?




నేచరుల్ స్టార్ నాని కెరీర్ లో ఇప్పటివరకు ఎన్నో హిట్ సినిమాలు వచ్చినా.. ఇప్పుడు అందరి దృష్టి మాత్రం ది ప్యారడైజ్ మూవీపైనే ఉందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ఆ పాన్ ఇండియా మూవీపై ఇప్పటికే ఆడియన్స్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఆ సినిమా ఓపెనింగ్స్ గురించి వస్తున్న టాక్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. రీసెంట్‌గా సోషల్ మీడియాలో ప్యారడైజ్ మూవీపై పలు రూమర్లు వైరల్ అయ్యాయి. షూటింగ్ ఆలస్యం అవుతోందని, ఇప్పటికే తీసిన కొన్ని సన్నివేశాలు రీషూట్ చేస్తున్నారని ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలన్నింటికీ చిత్ర బృందం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. ఇప్పటివరకు సినిమా షూటింగ్ 100 రోజులకు పైగా సాఫీగా పూర్తైందని, ఎక్కడా ఎలాంటి అంతరాయం లేదని స్పష్టం చేసింది. అంతేకాదు.. ఇప్పటి వరకు ఒక్క సీన్ కూడా రీషూట్ చేయలేదని, భవిష్యత్తులో కూడా అలాంటి ప్లాన్ లేదని క్లారిటీ ఇచ్చింది. ఆ ప్రకటన తర్వాత మరోసారి సినిమా మీద నమ్మకం పెరిగింది. ఎందుకంటే ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పోస్టర్స్, ఆయా షేర్ సాంగ్ సినిమాపై విపరీతమైన హైప్ తీసుకొచ్చాయి. ముఖ్యంగా స్లమ్ బ్యాక్ డ్రాప్ లో నాని కనిపించిన తీరు, ఆయన మాస్ మేకోవర్ అభిమానులను ఆకట్టుకుంటోంది. జడలు, ముక్కు పుడకతో పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తున్న నాని.. ఈసారి తన కెరీర్ లోనే మోస్ట్ వైల్డ్ పాత్రలో కనిపించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇక్కడే అసలు చర్చ మొదలైంది. నాని గత చిత్రం హిట్ 3 ప్రపంచవ్యాప్తంగా తొలి రోజు దాదాపు రూ.43 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. అంతకుముందు వచ్చిన దసరా కూడా మొదటి రోజు సుమారు రూ.38 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టి అప్పట్లో నాని కెరీర్ లో బిగ్గెస్ట్ ఓపెనర్‌గా నిలిచింది. ఇప్పుడు ది ప్యారడైజ్ మాత్రం ఆ రెండు సినిమాల రికార్డులను కలిపినా దాటేస్తుందా? అన్న చర్చ జరుగుతోంది. కొంతమంది ట్రేడ్ పండితులు.. ఆ సినిమాకు రూ.100 కోట్ల వరకు ఓపెనింగ్ వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

నిజానికి నాని ఇప్పటివరకు ఏ సినిమాతోనూ తొలి రోజు రూ.100 కోట్ల క్లబ్‌లోకి వెళ్లలేదు. కానీ గత కొన్ని మూవీలతో ఆయన మార్కెట్ బాగా పెరిగింది. ముఖ్యంగా దసరా, హిట్ 3, సరిపోదా శనివారంలాంటి సినిమాలు నానికి మాస్ ఆడియన్స్‌లో భారీ క్రేజ్ తీసుకొచ్చాయి. ఇప్పుడు అదే క్రేజ్ ది ప్యారడైజ్‌కు ప్లస్ అవుతుందని టాక్ వినిపిస్తోంది. ఇక సినిమాను ఆగస్టు 21న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు. నాని సరసన కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. మోహన్ బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. దసరా తర్వాత నాని– శ్రీకాంత్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. పైగా పాన్ ఇండియా మార్కెట్‌ను టార్గెట్ చేస్తూ తెరకెక్కుతున్న ఆ సినిమా.. నాని కెరీర్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# సరైన డేట్ కే 'జన నాయగన్'.. ఫ్యాన్స్‌కు డబుల్ ఫెస్టివల్?



కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం జన నాయగన్ విడుదలపై ఎట్టకేలకు క్లారిటీ వచ్చినట్లు తెలుస్తోంది. గత కొన్ని నెలలుగా సెన్సార్ సమస్యలు, రాజకీయ చర్చలు, రిలీజ్ డేట్‌పై అనేక ఊహాగానాల మధ్య నిలిచిపోయిన ఆ సినిమా ఇప్పుడు మళ్లీ ట్రాక్ లోకి వచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా జూన్ 22 రిలీజ్ డేట్ ఫైనల్ అయ్యే అవకాశాలు కనిపిస్తుండటంతో అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. హెచ్ వినోత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఆ పొలిటికల్ యాక్షన్ డ్రామా ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఎన్నికలకు ముందే దాదాపు అన్ని పనులు ముగిసినా, సెన్సార్ ఇష్యూస్ విడుదలను ఆలస్యం చేశాయి. కొన్ని డైలాగులు, సీన్లకు సంబంధించిన అంశాలపై అభ్యంతరాలు రావడంతో సినిమా రివైజింగ్ కమిటీకి వెళ్లినట్లు సమాచారం. ఇప్పుడు ఆ కమిటీ నుంచి గ్రీన్ సిగ్నల్ రానుండడంతో విడుదలకు లైన్ క్లియర్ అయినట్లే. ఈ వీకెండ్‌లోగా మేకర్స్‌కు సెన్సార్ సర్టిఫికేట్ అందే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. ఆ వెంటనే కొత్త రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. జూన్ 22న ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారని ఇప్పుడు వార్తలు వస్తున్నాయి. దీంతో ఫ్యాన్స్‌కు డబుల్ ఫెస్టివల్ అంటూ ఇప్పుడు సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతోంది. డబుల్ ఫెస్టివల్ ఎందుకంటే..జూన్ 22న విజయ్ బర్త్ డే. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇది మొదటి పుట్టినరోజు కావడం విశేషం. అందుకే అభిమానులు ఈసారి బర్త్ డేను మరింత గ్రాండ్‌గా సెలబ్రేట్ చేయడానికి సిద్ధమవుతున్నారు. అదే రోజు జన నాయగన్ విడుదలైతే పొలిటికల్ విక్టరీ, సినిమా ఫెస్టివల్ రెండూ కలిసి అభిమానులకు డబుల్ ట్రీట్‌లా మారే అవకాశముంది. అందుకే మేకర్స్ కూడా ఆ డేట్ పైనే ఎక్కువగా ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక విజయ్‌కు సంబంధించిన మరో ఆసక్తికర విషయం కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ముఖ్యమంత్రిగా మారిన తర్వాత ఆయన పేరుకు ముందు దళపతి బదులు ముఖ్యమంత్రి అనే ట్యాగ్ వేయాలని నిర్మాతలు భావించినట్టు సమాచారం. అయితే విజయ్ మాత్రం ఆ ప్రపోజల్ ను తిరస్కరించారట. తనను ఈ స్థాయికి తీసుకొచ్చింది సినిమా ప్రేక్షకులే కాబట్టి, అభిమానులు ప్రేమగా పిలిచే దళపతి అనే ట్యాగ్‌ను అలాగే కొనసాగించాలని స్పష్టం చేసినట్లు టాక్ వినిపిస్తోంది. అంతేకాదు, పొలిటికల్ ఇమేజ్ దృష్ట్యా కొన్ని పవర్ ఫుల్ డైలాగులు, ఇంట్రడక్షన్ ఎలిమెంట్స్ మార్చాలన్న సూచనలకు కూడా విజయ్ అంగీకరించలేదని చెబుతున్నారు.

సినిమా అనేది సినిమాగానే ఉం డాలని, పొలిటికల్ ప్రమోషన్ స్టేజ్‌గా కనిపించకూడదనే ఉద్దేశంతో ఆయన నిర్ణయం తీసుకున్నారన్న చర్చ జరుగు తోంది. అయితే కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఆ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. మరి జూన్ 22 నే ఫైనల్ డేట్‌గా ప్రకటిస్తారా? లేక మార్పు ఉంటుందా? అన్నది వేచి చూడాలి.

# పెద్ది అసలు హైలైట్ చెప్పిన చరణ్!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ మల్టీ స్పోర్ట్స్ డ్రామా పెద్దిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. గ్రామీణ బ్యాక్‌డ్రాప్, స్పోర్ట్స్ ఎలిమెంట్స్, ఎమోషనల్ స్టోరీలైన్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఫ్యాన్స్‌లో ప్రత్యేక ఆసక్తి కనిపిస్తోంది. ముఖ్యంగా రీసెంట్ గా రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్, చరణ్ లుక్, మాస్ టోన్ సినిమాకు మరింత హైప్ తీసుకొచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా రామ్ చరణ్ చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో కొత్త చర్చకు దారి తీశాయి. డైరెక్టర్ బుచ్చిబాబుతో కలిసి స్పెషల్ డ్రైవ్ ఇంటర్వ్యూలో పాల్గొన్న చరణ్, పెద్ది సినిమాలో తనకు అత్యంత ఇష్టమైన భాగం ఢిల్లీ ఎపిసోడ్ అని చెప్పడం అభిమానుల్లో క్యూరియాసిటీని పెంచేసింది. ఆ ఎపిసోడ్ నుంచే నుంచే సినిమా నెక్స్ట్ లెవెల్‌కు వెళ్తుందని, అదే అసలు మెయిన్ పాయింట్ అని చరణ్ చెప్పడంతో ఫ్యాన్స్ తెగ ఎగ్జైట్ అయిపోతున్నారు. సాధారణంగా స్టార్ హీరోలు సినిమాపై హైప్ పెంచేలా కామెంట్స్ చేయడం కొత్తేమీ కాదు. కానీ చరణ్ ఈసారి ప్రత్యేకంగా ఒక ఎపిసోడ్‌ను మాత్రమే హైలైట్ చేయడం ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణమైంది. ఇప్పటికే పెద్దిలో ఢిల్లీ ట్రాక్‌కు భారీ స్థాయి ఎమోషనల్ వెయిట్ ఉంటుందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పుడదే ట్రాక్ తన ఫేవరెట్ అని చరణ్ చెప్పడంతో అది సినిమాకు అసలు టర్నింగ్ పాయింట్ అయి ఉండొచ్చనే అంచనాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా ఇంటర్వెల్ తర్వాత కథ పూర్తిగా మారిపోతుందని, ఆ ఎపిసోడ్ హీరో జీవితాన్ని మార్చేస్తుందని ఊహాగానాలు ఆల్రెడీ సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి. మరో ఇంట్రెస్టింగ్ అంశం ఏంటంటే పెద్దిని ఇప్పటివరకు చాలా మంది కేవలం స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ఉన్న మాస్ సినిమా గానే భావించారు. కానీ చరణ్ కామెంట్స్ తర్వాత ఇది ఒక భారీ ఎమోషనల్ జర్నీ కూడా అవుతుందనే అభిప్రాయం బలపడుతోంది. ఒకవైపు గ్రామీణ నేపథ్యంలో సాగిన కథ అకస్మాత్తుగా ఢిల్లీకి షిఫ్ట్ అవ్వడం కూడా సినిమాకు పాన్ ఇండియా ఫీల్ తీసుకురావచ్చని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే, ఇప్పటికే మంచి హైప్ ఉన్న ఢిల్లీ ట్రాక్‌పై రామ్ చరణ్ చేసిన తాజా కామెంట్స్ సినిమాపై అంచనాలను మరోస్థాయికి తీసుకెళ్లాయి. ఇక చరణ్‌ను అంతగా కదిలించిన ఆ ఎపిసోడ్‌లో ఏముందో తెలుసుకోవాలంటే జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

# ఉపాధి హామీ పథకం వేతన దారులకు అవగాహన కార్యక్రమం : ఎస్ ఐ యు.మహేష్







**బొండపల్లి, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు సీ.ఐ ఎస్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో మండలంలోని నెలివాడ, బిల్లలవలస, రోల్లవాక గ్రామాలలో గల ఉపాధి హామీ పథకం వేతన దారులకు ఎస్.ఐ యు.మహేష్ పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా వేతనదారులు ఉపాధి హామీ పథకానికి సంబంధించి తమ బ్యాంక్ ఖాతాలలో పడిన నగదు మొత్తాన్ని తీసుకునేటప్పుడు ఏటీఎంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన అన్నారు. తమ ఏటీఎం కార్డును పరిచయం లేని వాళ్లకు ఇవ్వరాదని అలా ఇస్తే వాళ్లు ఏటీఎం కార్డును మార్చే ప్రమాదం ఉందని అవగాహన కల్పించారు.అదేవిధంగా మైనరులు అయిన ఆడపిల్లలను దగ్గర వాళ్లు, చుట్టుపక్కల వాళ్లతో ఉంచేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్.ఐ యు.మహేష్ అన్నారు. వేసవి కాలంలో చెరువులు నుయ్యిలకు పిల్లలు వెళ్లేటప్పుడు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు వహించాలని ఎస్సై యు మహేష్ అన్నారు. అలా కాకపోతే సరదా విషాదంగా మారే అవకాశం ఉందని ఎస్.ఐ యు.మహేష్ చెప్పారు. వేతనదారులు ద్విచక్ర వాహనాలను ఉపయోగించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఏవిధంగా ప్రయాణించాలో అనే అంశంపై ఎస్.ఐ యు.మహేష్ పలు సూచనలు చేశారు. యువత ఆన్లైన్ క్రికెట్ బెట్టింగులు, ఐపీఎల్ బెట్టింగ్‌ల జోలికి వెళ్ళవద్దని ఆయన అన్నారు. అదేవిధంగా ఎవరైనా గంజాయి వినియోగించిన... కొనుగోలు, అమ్మకాలు చేసిన వాళ్లపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జలజీవన్ మిషన్ 2.౦ పనులకు సిద్ధం కావాలి

## - జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సేధు మాధవన్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జలజీవన్ మిషన్ 2.0 పనుల కార్యాచరణకు సిద్ధం కావాలని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ ఆదేశించారు. జెజెఎం 2.0, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛభారత్ మిషన్ తదితర అంశాలపై పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ కాంతిలాల్ దండే వివిధ జిల్లాల కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాల అమలు గురించి ప్రభుత్వం నిర్ధేశించిన అంశాలను ఆయన వివరించారు. ఈ నెల 22న జిల్లా కలెక్టర్లతో కేంద్ర జలవనరుల శాఖామంత్రి సమీక్షిస్తారని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా అధికారులనుద్దేశించి ఇన్‌ఛార్జ్ కలెక్టర్ సేధు మాధవన్ మాట్లాడుతూ, జెజెఎం 2.0 కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం డిసెంబరు 2028 వరకు పొడిగించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని ప్రతీ ఇంటికి సురక్షిత త్రాగునీరు అందించేందుకు అవసరమైన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. అదేవిధంగా స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాన్ని 2027 వరకు పొడిగించడం జరిగిందని చెప్పారు. ఓడిఎఫ్ ప్లస్ కార్యక్రమం క్రింద ప్రతీ ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డిని, అవసరమైన చోట సామూహిక మరుగుదొడ్డిన నిర్మించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకోవాలని, సమగ్ర ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణా విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, జెడ్పి సిఈఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు కళ్ళద్దాల పంపిణీ






**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో తిరుపతి అరవింద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఘనంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గత నెల 15వ తేదీన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షల్లో భాగంగా, శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగుల కోసమే ఈ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ... గత శిబిరంలో దాదాపు 28 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ఈ రోజు నిర్వహించిన ఫాలోఅప్ శిబిరంలో ఆ 28 మంది రోగుల ఆరోగ్య పరిస్థితిని, కంటి చూపును వైద్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వారికి ఉచితంగా కళ్ళద్దాలను అందజేశారు.

నిరుపేదల కంటి వెలుగు కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సీనియర్ నాయకులు, అన్నాస్వామిపల్లి ముచ్చేలి భాస్కర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. అలాగే ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ శిబిరంలో హాస్పిటల్ సిబ్బంది, స్థానిక నేతలు మరియు పెద్ద సంఖ్యలో రోగులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలి

## - సి పి ఐ (ఎం ఎల్ న్యూ డెమోక్రసీ) జిల్లా కార్యదర్శి డి.పి.పోలయ్య డిమాండ్



**గూడూరు, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, సిఎన్జి ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డిపి పోలయ్య డిమాండ్ చేశారు. బుధవారం గూడూరులో విశ్రాంతి ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని, పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, సిఎన్జి ధరలను తగ్గించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తుందని, ప్రజలపై పెనుభారాలు మోపుతున్నదని విమర్శించారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచుతున్నదని దుయ్యబట్టారు. వంట గ్యాస్ పై 60 రూపాయలు, కమర్షియల్ గ్యాస్‌పై 993 రూపాయలు, పెట్రోల్, డీజిల్‌పై మూడు రూపాయలు చొప్పున, సిఎన్జి గ్యాస్‌పై రూపాయి చొప్పున ధరలు పెంచి, వేల కోట్ల రూపాయల బారాలను మోపి సామాన్య ప్రజల నడ్డి విరిచిందని ఎద్దేవా చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ఈ ధరలను పెంచి తమ వర్గ నైజాన్ని చాటుకుందని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, సిఎన్జి గ్యాస్ ధరలు పెరగడంతో రవాణా రంగంపై భారం పడటం, నిత్యావసర వస్తువుల ధరలతో పాటు, అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని అన్నారు. సామాన్య ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. చమురు కంపెనీల ఒత్తిళ్లకు తలొగ్గి మరో 10 రూపాయలు పెట్రోల్, డీజిల్‌పై పెంచడానికి మోడీ ప్రభుత్వం సాహసించడం దుర్మార్గమని అన్నారు. తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, సిఎన్జి ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కె చంగల్ రావు, బిసిడబ్ల్యు జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు డి నవ కోటి, ఎం అనిల్, నాయకులు రత్నయ్యలు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

## - జిల్లా వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ షహనాజ్


**గూడూరు, (రాజధాని వార్తలు):** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ షహనాజ్ సూచించారు. బుధవారం గూడూరు రెండో పట్టణ సమీపంలోని గాంధీనగర్ ప్రాంతంలో ఉన్న ఐసిడిఎస్ రూరల్ కార్యాలయంలో కిశోరి వికాసంలో భాగంగా కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న షహనాజ్ మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు మగ పిల్లలకు 21 నిండిన తర్వాతే వివాహాలు చేయాలని అలా చేయని పక్షంలో చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారని పేర్కొన్నారు. ఇంకా ఆమె విద్యా హక్కు చట్టం, ఫోక్సో చట్టం, వరకట్న వేధింపులు వంటి వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్లు స్వరూపారాణి, శివజ్యోతి, హైమావతి, రేణుక, చెంచులక్ష్మి, టాటా ట్రస్టు ప్రతినిధి



పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ పేరుతో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి

## - కొత్త పథకం మాకొద్దు : నలుగురి రమణయ్య



**వరదయ్యపాలెం, (రాజధాని వార్తలు):** మహాత్మా గాంధీ పేరుతో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి. కొత్త పథకం మాకొద్దు అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నలుగురి రమణయ్య అన్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ పేరుతో ఉన్న పాత గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఎంపీడీవో ఆఫీసు వద్ద, సచివాలయాల వద్ద నిరసన తెలియజేసి అధికారులకు వినతిపత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నలుగురి రమణయ్య, వరదయ్యపాలెం మండల కార్యదర్శి సుబ్బయ్యలు వేర్వేరుగా మాట్లాడుతూ మాహాత్మ గాంధీ పేరుతో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం పరిధిలో ఉన్నదని, కొత్తగా వచ్చిన వి బి రామ్ జి పథకం కేవలం కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకంగా ఉన్నదని, కేంద్ర ప్రభుత్వం యొక్క దయాదాక్షిణ్యాలపై నిధులు విడుదల చేసే అవకాశం ఉన్నందున ఈ పథకం మాకొద్దని నిరసన తెలియజేశారు. పాత పథకంలో 90శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌గా మంజూరు చేస్తుండేదని, కొత్త పథకంలో కేవలం 60 శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చి మిగిలిన 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి ఉన్నదని తెలిపారు. ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం నిధులు ఇవ్వలేక ఈ సంవత్సరం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వహించలేమని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడం దారుణమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దాపరిస్తాయని ఆంధ్రప్ర దేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్ర మానికి పిలుపునిచ్చిందన్నారు. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేసి పాత పద్ధతులను మహాత్మా గాంధీ పేరుతో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగిస్తూ సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి రోజుకు 700 రూపాయలు వేతనం మంజూరు చేయాలని, పెండింగ్లో ఉన్న ఉపాధి కూలీలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ మేరకు వినతి పత్రాన్ని ఎంపీడీవోకి సచివాలయ కార్యదర్శికి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాల గురవయ్య, తిరుపాలు, పండయ్య, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

## - స్వచ్ఛందంగా మెడికల్ షాపులు మూసివేత

**శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు):** ఆన్ లైన్లో మందుల విక్రయానికి, వీలు కానీ ఎక్కువ డిస్కౌంట్ బోర్డులతో ప్రజలను మభ్యపెడుతూ పెడుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతూ, యువతకు సులభంగా మత్తును కలిగించే మందులను విక్రయం చేస్తూ వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ సంస్థలకు, ఈ ఫార్మసీ విధానానికి వ్యతిరేకంగా అఖిల భారత కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పిలుపు మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని అన్ని మందుల దుకాణాలను మూసివేసి సమ్మెలో పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని బేరవారి మండపం నుండి ర్యాలీ ప్రారంభమై నాలుగు మాడ వీధులలో కెమిస్ట్ల ఐక్యత వర్ధిల్లాలి, ఈ ఫార్మసీ విధానాన్ని రద్దు చేయాలని ముక్తకంఠంతో నినదించారు. ఈ సమ్మెకు మద్దతుగా చాంబర్ ఆఫ్ కామర్ సభ్యులు, వివిధ వ్యాపార సంఘాల నాయకులు పాల్గొన్నారు. సమ్మెకు సంపూర్ణ మద్దతు




తెలిపిన సభ్యులకు శ్రీకాళహస్తి మెడికల్ అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపారు.

# స్వర్ణాంధ్ర పి.4 ఫౌండేషన్‌కు పరిశ్రమలు విరాళాలు ఇవ్వాలి

## - పేదరిక నిర్మూలనకు పరిశ్రమలు భాగస్వాములు కావాలి - అనకాపల్లి జిల్లాలో 1.34 లక్షల బంగారు కుటుంబాలు

## - జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు కృషి చేయాలి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్








**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర సమగ్ర అభివృద్ధి మరియు పేదరిక నిర్మూలన లక్ష్యంగా పనిచేస్తున్న 'స్వర్ణాంధ్ర పి.4 ఫౌండేషన్'కు జిల్లాలోని పారిశ్రామికవేత్తలు మరియు కార్పొరేట్ సంస్థలు తమ వంతు మద్దతుగా విరాళాలు అందించాలని, అనకాపల్లి జిల్లాలో 1.34 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని, పరిశ్రమలు దత్తత తీసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ కంపెనీల పారిశ్రామికవేత్తలతో జరిగిన 'స్వర్ణాంధ్ర విజన్ ఏ 2047' సదస్సులో జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, స్వర్ణాంధ్ర పి.4 ఫౌండేషన్' స్టేట్ డైరెక్టర్ సాంబశివరావులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పరిశ్రమల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ పరిశ్రమలు ఏదైనా ఒక గ్రామాన్ని లేదా మండలాన్ని దత్తత తీసుకుని, అక్కడ మౌలిక వసతుల కల్పన మరియు ప్రజల ఎమోషనల్, మెంటల్ స్పేస్‌కు అండగా నిలుస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని తెలిపారు. ఒకవేళ వ్యక్తిగతంగా సమయాన్ని కేటాయించలేక పోయినా, ఈ పథకం కింద అనుమతించబడిన క్రౌడ్ ఫండింగ్ లేదా క్రౌడ్ సోర్సింగ్ ద్వారా పరిశ్రమలు మరియు వ్యక్తులు తమ భాగస్వామ్యాన్ని అందించవచ్చన్నారు. పరిశ్రమలు నేరుగా స్వర్ణాంధ్ర పి.4 ఫౌండేషన్‌కు నిధులను విరాళంగా ఇవ్వవచ్చని, రాష్ట్ర స్థాయిలో ఉండే ఈ ఫౌండేషన్‌కు ఏ జిల్లాలో ఏ రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలో, ఎక్కడ నిధులు అవసరమో భౌగోళికంగా, ఆర్థికంగా స్పష్టమైన అవగాహన ఉంటుందని కలెక్టర్ వివరించారు. పరిశ్రమలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కమిటీ సమావేశాలలో ప్రభుత్వం యొక్క ఈ అవసరాలను, 'స్వర్ణాంధ్ర పి.4 ఫౌండేషన్' యొక్క కాన్సెప్ట్‌ను చర్చించి, సానుకూల నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ కోరారు. పరిశ్రమలు ఒక నిర్దిష్టమైన టాస్క్‌ను ఎంచుకుని ముందుకు వెళ్లవచ్చని లేదా నేరుగా ఫౌం డేషన్‌కు నిధులు సమకూర్చడం ద్వారా ఫౌండేషన్ అధికారులే ప్రాధాన్యత క్రమంలో ఆయా రంగాల అభివృద్ధికి ఆ నిధులను వినియోగిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పుట్టి పెరిగిన ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ఈ మహత్తర పరివర్తనలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. "స్వర్ణాంధ్ర పి.4 ఫౌండేషన్" స్టేట్ డైరెక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు వీలుగా ప్రభుత్వం రూపొందించిన 'స్వర్ణాంధ్రప్రదేశ్ ట్రాన్స్‌ఫార్మేషన్ విజన్' సాధనలో పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం అత్యంత కీలకమని స్వర్ణాంధ్ర పి.4 ఫౌండేషన్ డైరెక్టర్ సాంబ శివరావు పిలుపునిచ్చారు. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రభుత్వం పది సూత్రాల విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఈ పది సూత్రాలలో 'పేదరిక నిర్మూలన' అత్యంత కీలకమైన అంశమని స్పష్టం చేశారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్ (పి4) విధానం ద్వారా పేదరికాన్ని ఎలా నిర్మూలించవచ్చో వివరిస్తూ, ఈ పరివర్తనలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని కోరారు.


2047 నాటికి రాష్ట్రాన్ని సరికొత్తగా మార్చ డంలో పరిశ్రమల పాత్రను ఆయన రేఖాచిత్రం ద్వారా వివరిం చారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు మరియు కార్యక్ర మాల ద్వారా పి.4 ఫౌండేషన్‌తో పరిశ్రమలు ఏ విధంగా కలిసి నడవవచ్చో సవివరంగా వివరించారు. ఈ లక్ష్యాల సాధన కోసం మరియు పరిశ్రమలకు పూర్తి స్థాయిలో సహకరించడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంస్థాగత సౌకర్యాలను ఆయన పారిశ్రామికవేత్తలకు వివరించారు. రాబోయే రోజుల్లో పారిశ్రామిక సంఘాలతో ఏ విధంగా కలిసి ముందుకు సాగాలి, ఉమ్మడి వ్యూహాల ద్వారా స్వర్ణాంధ్ర విజన్‌ను ఎలా సాకారం చేయాలనే అంశంపై ఈ సమావేశంలో పారిశ్రామికవేత్త లకు వివరించారు. ఈ సమావేశంలో సిపిఓ రామారావు, ఇం డస్ట్రీస్ జనరల్ మేనేజర్ పి కె పి ప్రసాద్, జిల్లా పరిధిలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వివిధ పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు మరియు ప్రభుత్వ రంగ సంస్థల (పి.ఎస్.యు.ఎస్) ప్రతినిధులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సేవలో - గంగపుత్రులకు అండగా ప్రజా ప్రభుత్వం

## - అనకాపల్లి జిల్లాలో 13,661 మత్స్యకార కుటుంబాలకు రూ.27.32 కోట్ల ఆర్థిక సాయం








**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** వేట నిషేధ కాలంలో మత్స్యకార కుటుం బాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ఆదుకునేందుకు ప్రభు త్వం అమలు చేస్తున్న 'మత్స్యకారుల సేవలో' పథకం కింద అనకాపల్లి జిల్లాలో మొత్తం 13,661 అర్హులైన మత్స్యకార కుటుంబాలకు రూ.27,32,20,000 ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేసింది. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు లబ్ధిదారులకు ఆర్థిక సాయం పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ, మత్స్యకార కుటుంబాలు వేట నిషేధ కాలంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. మత్స్యకారుల ఆదాయం పెంపు కోసం సీవీడ్ సాగు వంటి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వరుసగా రెండో ఏడాది కూడా మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రతి సంవత్సరం చేపల సంరక్షణ కోసం అమలు చేసే 61 రోజుల వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. జిల్లాలో నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి నియోజకవర్గంలో 960 మంది మత్స్యకారులకు రూ.1.92 కోట్లు, యలమంచిలి నియోజకవర్గంలో 4,352 మంది మత్స్యకారులకు రూ.8.7 కోట్లు పాయకరావుపేట నియోజకవర్గంలో 8,349 మంది మత్స్యకారులకు రూ.16.69 కోట్లు ఆర్థిక సాయం జమైంది. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ జెడ్పీటీసీ , సర్పంచ్, మండల కోపరేటివ్ సభ్యులు, మత్స్యకారులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.



# రైతు బజారులో రైతులకు స్టాళ్ల కోసం డ్రా పద్ధతిలో కేటాయింపు

## - రైతు బజార్ త్వరలో ప్రారంభం : జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్












**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లిలోని డాక్టర్ ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో త్వరలో ప్రారంభం కానున్న రైతు బజారులో రైతులకు స్టాళ్ల కేటాయింపుల కోసం డ్రా పద్ధతిలో కేటాయించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయ విసి హాల్లో బుధవారం సాయంత్రం డ్రా తీయడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం 125 దరఖాస్తులు అందగా, వాటిలో 72 మంది రైతులకు పారద ర్శకంగా డ్రా పద్ధతి ద్వారా స్టాళ్లను కేటాయించడం జరిగిం దన్నారు.

రైతులు మరియు వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రైతు బజార్ త్వరలో ప్రారంభించనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు.

# మూలప్ప గొలుసు కట్టు చెరువుకు మహర్దశ

## - మూలప్ప చెరువు ప్రగతికి ప్రతిరూపం..... పునరుద్ధరణ





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** భారత ప్రధానమంత్రి ప్రోత్సాహం తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యుల ఆదేశాలులతో రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న 'జలధార - జల హారతి' కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో మూలప్ప గొలుసుకట్టు చెరువు సరికొత్త రూపురేఖలను సంతరించుకుంటోంది. దశాబ్దాలుగా పూడికతో నిండిన ఈ గొలుసు కట్టు చెరువు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రణాళిక ప్రకారము జలవనరుల శాఖ వారి సౌలభ్యంతో పునరుద్ధరించడం ద్వారా ఈ ప్రాంత రైతాంగం మరియు జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రధాన అభివృద్ధి పనులు... మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ గొలుసు కట్టు చెరువు. 'జలధార' పథకం లో ఈ పనులు కొనసాగుతున్నాయి చెరువు 1000 మీటర్లు పొడవునా పనులు చేపడుతున్నారు ఈ పనులు కేవలం పూడికతీతకే పరిమితం కాకుండా, సమగ్ర అభివృద్ధి దిశగా సాగుతున్నాయి: సుమారు 3000 క్యూబిక్ మీటర్లు పూడికను తొలగించడం ద్వారా 300 మందికి జీవనోపాధి కల్పిస్తూ చెరువు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. బలమైన కట్టలు... 'జల హారతి' కార్యక్రమంలో భాగంగా 750 వంటకాలువలు చెరువు గట్లను పటిష్టం చేసి, రాబోయే వర్షాకాలంలో ఎటువంటి గండ్లు పడకుండా రక్షణ చర్యలు చేపట్టారు. పర్యావరణ సుందరీకరణ... చెరువు గట్టు గట్లు పునరుద్ధరణ వంటి పనులు 750 పంట కాలువలు మరమ్మత్తులు చేపట్టడం అయినది. ఊతం... ఈ చెరువు కింద ఉన్న సుమారు 22 ఎకరాల ఆయకట్టుకు ఇకపై సాగునీటికి ఢోకా ఉండదు. 750 పంట కాలువలు రిపేరు వరి రైతులకు ఇది సంజీవనిలా మారనుంది. భూగర్భ జలాల పెంపు.. చెరువులో నీరు నిల్వ ఉండటం వల్ల చుట్టుపక్కల బోరుబావుల్లో నీటి మట్టం పెరిగి, వేసవిలో కూడా తాగునీటి ఎద్దడి తలెత్తదు.

**RAJADHANI CLASSIFIEDS Ad. Call 9440662699, rajadhanivartalu.com**

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ అయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పాస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 : విచక్షణతో కూడిన వినియోగం - స్థిరమైన భవిష్యత్తు



ప్రపంచం 2026 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ తరుణంలో, మానవాళి నాగరికత ఒక కీలకమైన మలుపులో నిలిచి ఉంది. మనం అద్భుతమైన సాంకేతిక, భౌతిక పురోగతి సాధించిన కాలంలో జీవిస్తున్నాం. అయినప్పటికీ, జీవనశైలి లోపాలు, పెరుగుతున్న మానసిక ఒత్తిడి, పర్యావరణ క్షీణత, అస్థిరమైన జీవన విధానాలులాంటి సవాళ్లనూ ఎదుర్కొంటున్నాం. ఈ సంక్షోభాలన్నింటికీ మూలకారణం - విచక్షణ రాహిత్యం, మితిమీరిన వినియోగమే. సహజ వనరులను విచ్చలవిడిగా వాడుకోవడం నుంచి డిజిటల్ వ్యసనాలు, అస్తవ్యస్తమైన జీవనశైలి వరకు, నేటి ఆధునిక సమాజాలు సమతుల్యతను కోల్పోతూ క్రమంగా దూరమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో, యోగా కేవలం ఒక ప్రాచీన ఆరోగ్య సాధనగా మాత్రమే కాదు, బాధ్యతాయుతమైన జీవన విధానానికి శాశ్వత మార్గదర్శిగా నిలుస్తుంది. యోగా మానవాళికి స్వీయ-నియంత్రణ, సంయమనం, స్పృహతో కూడిన నిర్ణయాలు తీసుకునే శక్తివంతమైన మార్గాన్ని అందిస్తుంది. ఇది మనలో, మన చుట్టూ ఉన్న ప్రపంచంతో ఎలా సామరస్యాన్ని సాధించాలో నేర్పుతుంది.

**విచక్షణతో కూడిన వినియోగం కోసం పిలుపు**

అపరిమిత వినియోగం అనే ఈ ప్రపంచ సవాలును ఎదుర్కొనేందుకు, గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ తమ దూరదృష్టితో 'మిషన్ లైఫ్' (Mission LiFE – లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) ద్వారా అద్భుతమైన దిశా నిర్దేశం చేశారు. COP26 సదస్సులో ప్రధాన మంత్రి మాట్లాడుతూ.. "ఈ రోజు మనకు కావలసింది విచక్షణ రహితంగా, వినాశకరంగా వస్తువులను వినియోగించడం కాదు; ఆలోచనాత్మకంగా, స్పృహతో కూడిన వినియోగం మాత్రమే" అంటూ యోగ తత్వశాస్త్రంతో ముడిపడిన ముఖ్య విషయాన్ని వివరించారు. ఇటీవలి కాలంలో ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, సరఫరా గొలుసు అంతరాయాల నేపథ్యంలో, ప్రధానమంత్రి ఈ పిలుపును ప్రతి ఒక్కరి రోజువారీ పౌర బాధ్యతగా మార్చారు. ఇంధనాన్ని ఆదా చేయడం, అనవసరమైన విద్యుత్ వాడకాన్ని తగ్గించడం, అవసరం లేని ఖర్చులను పునరాలోచించుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ వినియోగాన్ని తగ్గించుకోవాలని ఆయన కోరారు. ఈ పిలుపు ఏదో కొరత ఉందనే భావనతో చేసినది కాదు; ఇది దేశ బాధ్యత, స్థిరత్వం, సామూహిక స్థితిస్థాపకత కోసం వ్యూహాత్మకంగా, నైతికంగా చేసిన పిలుపు. ఆయన గుర్తు చేసినట్లుగా, "చిన్న, పెద్ద ప్రయత్నాలు ప్రతి ఒక్కటీ ముఖ్యమైనవే; ప్రతి చిన్న చుక్కే.. కుండను నింపేది". ఈ ఆలోచనలు యోగా ప్రాథమిక సూత్రాలతో పూర్తిగా ముడిపడి ఉన్నాయి. యోగ తత్వశాస్త్రం 'అపరిగ్రహం' (అనవసరమైన వస్తువులను కూడబెట్టకపోవడం), 'సంతోషం' (మనకు నిజంగా అవసరమైన వాటితో తృప్తి చెందడం) గురించి చెప్తుంది. ఈ సూత్రాలు కలిసి, మనుషులను బలవంతపు వినియోగం నుండి స్పృహతో కూడిన జీవనం వైపు నడిపిస్తాయి. యోగా మనల్ని కేవలం వస్తువులను అనుభవించే వినియోగదారులుగా కాకుండా, ఈ భూమిని కాపాడే బాధ్యతాయుతమైన రక్షకులుగా మారుస్తుంది.

**పర్యావరణ సామరస్యానికి యోగా ఒక సాధనం**

మానవుల అవసరాలను తీర్చడానికి ఈ భూమిపై తగినన్ని వనరులు ఉన్నాయి, కానీ మనుషుల అపరిమితమైన అత్యాశను తీర్చడానికి మాత్రం సరిపోవు. ప్రకృతితో మనకున్న బంధాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా యోగా మనలో ఈ అవగాహనను తిరిగి నింపుతుంది. మనం పీల్చే గాలి, తినే ఆహారం, మనం కోరుకునే స్థిరత్వం అన్నీ ఒకే పర్యావరణ వ్యవస్థలో భాగమే. యోగా సాధన క్రమంగా మన ప్రవర్తనను లోపలి నుంచి మారుస్తుంది. ఇది మానసిక అశాంతిని తగ్గిస్తుంది, తొందరపాటు నిర్ణయాలను అరికడుతుంది, స్వీయ-క్రమశిక్షణను పెంచుతుంది. క్షణికానందం, విపరీతమైన వినియోగ సంస్కృతితో నడుస్తున్న నేటి ప్రపంచంలో, నిజమైన అవసరానికి, అంతులేని కోరికకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించే మానసిక స్పష్టతను యోగా మనకు ఇస్తుంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆయుష్ మంత్రిత్వ శాఖలతో ముడిపడి ఉన్న మంత్రిగా, అంటువ్యాధులు కాని దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు యోగా ఒక అద్భుతమైన ప్రజారోగ్య సాధనంగా ఎలా ఉపయోగపడుతుందో నేను ప్రతిరోజూ చూస్తున్నాను. శారీరక శ్రమ, మానసిక సమతుల్యత, క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని అలవాటు చేయడం ద్వారా, యోగా అనేది అనారోగ్యకరమైన అలవాట్లను, విపరీతమైన వైద్య చికిత్సలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. యోగ జీవనశైలి సహజంగానే సరళత, సంయమనం, సమతుల్య ఆహారం, వ్యర్థాల తగ్గింపు, వనరుల సద్వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది – పర్యావరణ స్థిరత్వానికి సరిగ్గా ఇలాంటి ప్రవర్తనా మార్పులే అవసరం. అందువల్ల, యోగా అనేది కేవలం వ్యక్తిగత ఆరోగ్య మార్గం మాత్రమే కాదు; ఇది పర్యావరణ బాధ్యతకు ఒక ఆచరణాత్మకమైన మార్గదర్శి కూడా.

**ప్రపంచ ఆరోగ్య రంగంలో భారతదేశ నాయకత్వం**

నేడు, యోగా అనేది ప్రపంచానికి భారత్ అందించిన అత్యంత ప్రభావవంతమైన కానుకలలో ఒకటిగా ఎదిగింది – ఇది ఆరోగ్యం, సామరస్యం, సామూహిక శ్రేయస్సుకు ఒక శక్తివంతమైన నిదర్శనం. ఒకప్పుడు ప్రాచీన నాగరికత పద్ధతిగా ప్రారంభమైనది, నేడు భౌగోళిక, రాజకీయ, భాషా, సాంస్కృతిక సరిహద్దులను దాటి ఒక ప్రపంచ ఉద్యమంగా మారింది. ప్రతి సంవత్సరం, వివిధ ఖండాల్లోని లక్షలాది మంది ప్రజలు కేవలం ఆసనాలు వేయడానికి మాత్రమే కాకుండా, మరింత ఆరోగ్యకరమైన, సమతుల్యమైన, స్థిరమైన జీవితాన్ని గడపాలనే సామూహిక ఆకాంక్షతో యోగా వేడుకల్లో పాల్గొంటున్నారు. యోగా అనేది వ్యాధుల నివారణ ఆరోగ్య సంరక్షణ, మానసిక శ్రేయస్సు, విచక్షణతో కూడిన జీవన విధానానికి సంబంధించిన ఒక విశ్వవ్యాప్త భాషగా అవతరించింది. యోగా ద్వారా, భారతదేశం ప్రపంచానికి సంపూర్ణ ఆరోగ్యం కోసం ఒక స్వేచ్ఛాయుతమైన, అందరినీ కలుపుపోయే మార్గాన్ని అందించింది --- ఇది ఆధునిక కాలపు ఆందోళనలను కాలాతీత జ్ఞానంతో పరిష్కరిస్తుంది. ×ణ్ 2026 లోతైన ప్రాముఖ్యత ఇదే. యోగా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను స్పృశిస్తుంది కాబట్టి, ఇది పెద్ద ఎత్తున ప్రజల ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ఒక అద్భుతమైన వేదికను అందిస్తుంది. స్థిరత్వం, సంయమనం, స్పృహతో కూడిన జీవన సందేశాలు యోగా యొక్క సామూహిక స్ఫూర్తి ద్వారా మరింత దూరం ప్రయాణించి, ప్రజల మనస్సుల్లో బలంగా నాటుకుపోతాయి.

IDY 2026 కోసం ఒక సామూహిక సంకల్పం

నిజమైన శ్రేయస్సు అనేది ఒంటరిగా సాధ్యం కాదు. మానవ ఆరోగ్యం, సమాజ శ్రేయస్సు, భూమి ఆరోగ్యం అన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. వాతావరణ మార్పులు, జీవనశైలి వ్యాధులు, పర్యావరణ క్షీణత వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి కేవలం ప్రభుత్వ విధానాలు మాత్రమే సరిపోవు, ప్రజల ప్రవర్తనలో మార్పు కూడా అవసరం. ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా, మన నిబద్ధత కేవలం యోగా మ్యాట్‌కే పరిమితం కాకూడదు.

యోగాను కేవలం రోజువారీ సాధనగా కాకుం డా, విచక్షణతో కూడిన వినియోగం, అంతర్గత క్రమశిక్షణ, పర్యావరణ బాధ్యతను పెంపొందించే ఒక జీవన విధానంగా మనం స్వీకరిద్దాం. స్పృహతో కూడిన జీవనం కోసం ప్రధాన మంత్రి ఇచ్చిన పిలుపును మనమంతా అందుకుందాం. కేవలం మనం ఎంత వినియోగిస్తున్నాం అనేదానితో కాకుండా, ఎంత బాధ్యతాయుతంగా జీవిస్తున్నాం అనేదానితో ప్రగతిని కొలిచే భవిష్యత్తును నిర్మిద్దాం. మన అంతర్గత వాతావరణాన్ని మార్చుకోవడం ద్వారా, మనమందరం కలిసి మన భూమి బాధ్యతను, బాహ్య వాతావరణాన్ని కాపాడుకుందాం.

**(రచయిత: - శ్రీ ప్రతాపరావు జాదవ్, కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ (స్వతంత్ర బాధ్యత) మరియు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి)**

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan